

బుడమేరు కబ్జాలపై సర్వే

- శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళిక
- ముఖ్యమంత్రి చంద్రబాబు

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 36 | విజయవాడ, గురువారం 5 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు : 5.50

Vol No | Vijayawada, Thursday 5 September 2024 | Rs

పోరాట ధీర



తొమ్మిది పదుల వయస్సున్న ఈమె పేరు తేతారీ దేవి. ఈ పండు వయస్సులో మనవళ్ల ఏమవుతుందులే? అని నీరసించక.. యువతతో కలిసి అడుగులేస్తూ చైతన్యం నింపారు. బీహార్‌లోని బక్సర్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) బుధవారం చేపట్టిన 'చలో కలెక్టరేట్ ర్యాలీలో అగ్రభాగాన యువ నాయకులతో పాటు ఉత్సాహంగా అడుగులేస్తూ పోరాట స్ఫూర్తి చాటారు. 'ఎముకలు కుళ్లిన, వయసులు మళ్లిన సోమరులారా చావండి..నెత్తురు మండే, శక్తులు నిండే యువకుల్లారా రారండి' ..అంటూ శ్రీశ్రీ ఏనాడో వెలిగించిన ఉద్యమజ్వాలను మరింతగా ప్రజ్వలింపజేసిన తేతారీ దేవికి రైతు సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. (వార్త 7వ పేజీలో)



దేవీపట్నం మండలం, గొందూరు గ్రామం వద్ద పూర్తిగా మునిగిపోయిన గండిపోచమ్మ గుడి

బుడమేరుకు మరో గండి

పూడ్చే పనులకు ఆటంకం

వర్షాల హెచ్చరికతో బాధితుల్లో ఆందోళన

ప్రజాశక్తి- విజయవాడ, ఇబ్రహీంపట్నం

విజయవాడ ప్రజానీకానికి విలయాన్ని చూపించిన బుడమేరుకు బుధవారం మరో మరో గండి పడింది. దీంతో మొత్తం నాలుగు గండ్లు పడ్డట్టైంది. మరోవైపు బడమేరు పరివాహక ప్రాంతంలోని ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు, మైలవరం, జి.కొండూరు మండలాల్లో వర్షాలు పడడంతో వరద ఉధృతి కొంత పెరిగింది. మంగళవారం సుమారు వెయ్యి క్యూసెక్కులకు పడిపోయిన బుడమేరు ప్రవాహం ఎగువ ప్రాంతాల్లో వర్షాల కారణంగా బుధవారం రాత్రి ఏడు గంటలకు 5,527 క్యూసెక్కులకు పెరిగింది. ఇది గండ్లు పూడ్చే పనులకు ఆటంకంగా మారింది. గతంలో కొండపల్లి శాంతినగర్-కవులూరు మధ్య మూడు చోట్ల గండ్లు పడ్డాయి. వీటిలో కొండపల్లి శాంతినగర్ వైపు గట్టును పూడ్చారు. మళ్లీ ఇదే ప్రాంతంలో బుధవారం గండిపడింది. దీనినీ పూడ్చారు. కవులూరు వైపు పడిన గండిని ప్రస్తుతం పూడుస్తున్నారు. ఇప్పటికే మొదటి గండిని, తాజా గండిని పూడ్చారు. మిగతా రెండు గండ్లు పూడ్చే పనులు జరుగుతున్నాయి. పెరుగుతున్న వరద ప్రవాహంతో ఈ పనులకు ఆటకం కలుగుతోంది. మరోవైపు గురు, శుక్ర వారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలతో వరద బాధితుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలోని ముంపు ప్రాంతాలతో పాటు, ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల ప్రజలను, విజయవాడ దిగువన ఉన్న కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం మోపర్రు, నందివాడ మండలం పుట్టగుంట, కుదరవల్లి, రామాపురం, అరిపిరాల తదితర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



ఇబ్రహీంపట్నం కవులూరు వద్ద బుడమేరు గండిని పూడుస్తున్న దృశ్యం

బంధువులు, స్నేహితుల ఇళ్లలో తలదాచుకుంటున్న బాధితులు

బుడమేరు వరద తగ్గుముఖం పట్టడంతో విజయవాడ అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలోని బాధితులు బతుకు జీవుడా అంటూ అక్కడ నుండి బయటకు వస్తున్నారు. నాలుగు రోజులపాటు వరదలో చిక్కుకుపోయి బిక్కుబిక్కుమంటూ గడిపిన ప్రజలు ఎట్టకేలకు మోకాలిలోతు నీళ్లలోనే నడుచుకుంటూ వచ్చి, తమ బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి ఇళ్లల్లో తలదాచుకుంటున్నారు.

చుట్టూ ఇంకా నీరు, బురద ఉన్నా తమ ఇళ్లు, ఇళ్లలోని సామాన్లను వదిలి పెట్టిరాలేక, ఒకవేళ బయటకు వెళ్తే ఏమవుతుందోననే భయంతో మరికొంతమంది అక్కడే ఉండిపోయారు. వరద బాధితులు ఆహారం, మంచినీటి కోసం నేటికీ అవస్థలు పడాల్సి వస్తోంది. అధికారం యంత్రాంగం పంపిణీ చేస్తున్న ఆహారం, మంచినీరు శివారు ప్రాంతాలకు, సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు చేరడంలేదు. అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సింగ్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాలు, వన్‌టౌన్ సితారా, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లో అధికారులు విద్యుత్ సరఫరాను తాజాగా పునరుద్ధరించారు.

గండ్లను పరిశీలించిన మంత్రులు లోకేష్, నిమ్మల

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శాంతినగర్-కవులూరు వద్ద బుడమేరుకు పడిన గండ్లను బుధవారం రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, నిమ్మల రామానాయుడు పరిశీలించారు. కొద్దిసేపు పనులను పర్యవేక్షించారు. ఎన్ని కోట్ల రూపాయిలు ఖర్చయినా గండ్లను త్వరగా పూడ్చాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు తాజా పరిస్థితిని తనకు వివరించాలని సూచించారు. గండ్లు పూడ్చివేత పనులు పూర్తయ్యే వరకు వాటిని పర్యవేక్షించాలని మంత్రి నిమ్మలను కోరారు. ముందుగా మంత్రి లోకేష్... బుడమేరు కుడి, ఎడమ ప్రాంతాల్లో పడిన గండ్లను పూడ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు.

వదంతులు నమ్మొద్దు : కలెక్టర్

బుడమేరుకు మళ్లీ వరదంటూ వస్తున్న వదంతులను నమ్మొద్దని, ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం ఆమె ఒక ప్రకటన చేస్తూ బుడమేరులో ప్రమాదకర స్థాయిలో నీరు లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వరద నియంత్రణకు పటిష్ట కార్యాచరణతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఒకవేళ మళ్లీ వరద వచ్చే పరిస్థితి ఉంటే ముందే సమాచారమిచ్చి అప్రమత్తం చేస్తామని తెలిపారు. ప్రకాశం బ్యారేజీ వరద తగ్గిందని పేర్కొన్నారు.

గోదావరికి వరద ఉధృతి

భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

జలదిగ్బంధంలో విలీన మండలాల ప్రజలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎగువ నుంచి వస్తోన్న వరద, కురుస్తోన్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. సోమవారం మధ్యాహ్నం నుంచి నీటి ప్రవాహం పెరిగింది. బుధవారం నాడు నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో 44.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఎగువ నుంచి 12 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతుండడంతో బుధవారం అర్ధరాత్రి సమయానికి నీటిమట్టం 48 అడుగులకు (రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి) చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 9.70 అడుగులకు ప్రవాహం చేరడంతో 175 గేట్లను పైకిలేపి 7,14,614 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు సాగు, తాగు నీటి అవసరాల నిమిత్తం 1,800 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఏలూరు జిల్లా పోలవరం స్పిల్‌వే ఎగువన 31.770 మీటర్లు, దిగువన 23.100 మీటర్లు నీటిమట్టం నమోదైంది. వరద ఇంకా పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోమారు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విలీన మండలాల ప్రజలు కలవరపడుతున్నారు. భద్రాచలం ఆలయ స్నానఘట్టాల ప్రాంతంలో మెట్లు నీట మునిగాయి. భద్రాచలం పట్టణంలోకి వరద వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.

జల దిగ్బంధంలోకి ముంపు మండలాలు

పోలవరం ముంపు మండలాలైన కూనవరం, విఆర్ పురం, చింతూరు, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లా వేలేరుపాడు మండలం వరద ముంపునకు గురైంది. కూనవరం, విఆర్ పురం మండలాల్లో అనేక గిరిజన గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని అధికారులు తెలిపారు. చింతూరు నుంచి చట్టికుంట వెళ్లే జాతీయ రహదారిపైకి వరద రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మారేడుమిల్లి ఘాట్ మిగతా2లో

ముందే హెచ్చరించలేదేం..?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జగన్
- వరదపీడిత ప్రాంతంలో పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బుడమేరు వరదల గురించి ప్రజానీకాన్ని ముందుగానే ఎందుకు హెచ్చరించలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారంఆయన విజయవాడలో వరదప్రభావిత ప్రాంతమైన

రాజరాజేశ్వరి పేటలో పర్యటించారు. వరద సాయం అందుతున్న తీరును బాదితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ అలసత్వంతోనే ఈ విధ్వంసం జరిగిందని, చంద్రబాబునాయుడు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాలు, వరదలకు సంబంధించి వాతావరణశాఖ ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ బాధితుల్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏం చేయడం లేదన్నారు. కరకట్టలోని తన ఇళ్ల మునిగిపోవడంతో అక్కడ వుండటం సాధ్యం కాదని కలెక్టర్ కార్యాలయంలో వుంటున్నారని చెప్పారు. ముందస్తు సమాచారం వున్నా ప్రభుత్వం ప్రజలను ఎందుకు అప్రమత్తం చేయలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ఇలాంటి దుస్థితి ఏనాడూ కనిపించలేదన్నారు. గోదావరికి వరదలొస్తే 40 వేలమందికి గాను 30 వేల మందిని రిలీఫ్ క్యాంప్‌లకు తరలించామన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అంతా కలిసి ఈ పనిచేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. వరద ప్రభావం తగ్గాక ఉత్త చేతులతో పంపకుండా తక్షణ పరిహార సొమ్మును అందించి పంపించామని గుర్తు చేశారు. తాను చేసిన తప్పులకు అధికారులను బలి చేస్తూ చంద్రబాబు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణానదికి తమ ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టకుంటే కష్ణలంక మునిగిపోయేదన్నారు. ఈ వర్షాలు, వరదలతో 32 మంది మరణించారని ఇంకా చాలా మంది అడ్రస్ దొరకడం లేదన్నారు . మృతుల కుటుంబాలకు రూ25 లక్షల పరిహారం అందించాలని, వరదల్లో చిక్కుకున్న ప్రతి ఇంటికి రూ 50 వేలు అందించాలని డిమాండ్ చేశారు.



రాజరాజేశ్వరి పేటలో వరద బాధితుల సమస్యలు వింటున్న మాజీ ముఖ్యమంత్రి జగన్

కేంద్రానికి కనిపించడం లేదా?

- వర్షాలు, వరదలతో భారీ నష్టం : షర్మిల

2

పవన్ కళ్యాణ్ భూరి విరాళం

- పంచాయతీకి రూ.లక్ష చొప్పున సాయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వరద బాధితుల సహాయం కోసం రూ.6 కోట్ల భూరి విరాళం ప్రకటించారు. వరద సహాయక చర్యలపై పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రతి పంచాయతీకి రూ.లక్ష చొప్పున వ్యక్తిగతంగా ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. దాదాపు 400 పంచాయతీలకు నేరుగా వాటి ఖాతాల్లోనే ఈ సొమ్ము జమ చేస్తానన్నారు. ఏపి ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇదివరకే ఆయన రూ.కోటి విరాళం ప్రకటించారు. దీంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి కూడా రూ.కోటి అందజేస్తానని తెలిపారు. వరద ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను గౌరవించే బాధ్యతను తాను తీసుకుంటానని చెప్పారు.



విజయవాడ అజిత్‌సింగ్‌నగర్లో ఇంటింటికి తిరిగి మంచినీళ్ల బాటిళ్లను పంపిణీ చేస్తున్న సిపిఎం బృందం

సహాయ చర్యల్లో సిపిఎం శ్రేణులు

- ఆహారం, మంచినీరు, పాలు, నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి- విజయవాడ

బుడమేరు, కృష్ణా నది వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం, వివిధ ప్రజా సంఘాల వారు సహాయక చర్యలు చేపట్టారు. ఆహారం, మంచినీరు, పాలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అజిత్‌సింగ్ నగర్, వాంబే కాలనీ, శాంతి నగర్, ప్రకాష్ నగర్, సుందరయ్య నగర్, రాజీవ్ నగర్, వడ్డెర కాలనీ, న్యూ రాజీవ్ నగర్, కండ్రిక కాలనీ, నందమూరి నగర్, కనకదుర్గ నగర్, న్యూ రాజరాజేశ్వరిపేట, ఉడా కాలనీ తదితర ప్రాంతాల్లో 2,500 మందికి ఆహారం, పాలు, మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశారు. సాయంత్రం సమయంలో మూడు వేల మందికి కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, దోమల నివారణకు అగరబత్తీలను అందజేశారు.

వరద సహాయ కార్యక్రమాల్లో సిపిఎం నాయకులు సిహెచ్ బాబూరావు, డివి కృష్ణ, దోనేపూడి కాశీనాథ్, ఆంధ్ర మాల్యాద్రి, యువజన, విద్యార్థి నేతలు రామన్న, రాము, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



అనంత్‌నాగ్‌లో జరిగిన బహిరంగ సభలో స్థానిక నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ

జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా

- రాహుల్ గాంధీ హామీ

జమ్మూ : జమ్మూ కాశ్మీర్‌లో బుధవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇండియా బ్లాక్ భాగస్వాములతో కలిసి కాంగ్రెస్ పార్టీ, కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూ కాశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హెూదా కల్పిస్తుందని హామీ ఇచ్చారు. "అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ముందుగానే జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హెూదా పునరుద్ధరించాలని మేం భావించాం. కానీ బిజెపి అందుకు సుముఖంగా లేదు. ఎన్నికలను ముందుగానే నిర్వహించాలని భావించింది." అని రాహుల్ పేర్కొన్నారు. "బిజెపి కోరుకున్నా లేకపోయినా దానితో సంబంధం లేకుండా ఈ ప్రాంతానికి రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలనుకుంటున్నాం. ఇండియా బ్లాక్ దీనిపై కేంద్రంతో పోరాడుతుందని రాహుల్ పేర్కొన్నారు. రాంబన్ జిల్లాలో బనిహల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సంగ్లాదన్‌లో ఎన్నికల ర్యాలీనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ నెలల 18న ఇక్కడ ఎన్నికలు జరగనున్నాయి. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు వికార్ రసూల్ వనీ ఈ నియోజకవర్గం నుండి పోటీచేస్తున్నారు.

టెక్సాస్‌లో రోడ్డు ప్రమాదం

నలుగురు భారతీయులు మృతి

టెక్సాస్ : టెక్సాస్‌లో కార్ పూలింగ్ ద్వారా నలుగురు భారతీయులు ప్రయాణిస్తున్న ఎస్‌యువి వాహనాన్ని వెనుక నుండి ట్రక్కు ఢీ కొట్టడంతో కాలి బూడిదయ్యారు. మరణించినవారిలో ముగ్గురు తెలుగువారు కాగా, ఒకరు తమిళనాడుకు చెందినవారు ఉన్నారు. అమెరికాలోని బెంటన్ విల్లేకు కార్‌పూలింగ్ ఎస్‌యువి కారులో వెళ్తుండగా టెక్సాస్‌లోని అన్నా వైట్ స్ట్రీట్ సమీపంలో ప్రమాదానికి గురైంది. కార్ పూలింగ్ అంటే కారు ప్రయాణాన్ని పంచుకోవడం. ఒకరికంటె ఎక్కువ మంది ఒకే రూట్‌లో గమ్యస్థానాలకు చేరుకునేందుకు కార్‌పూలింగ్ యాప్‌ను ఉపయోగిస్తుంటారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు మరో అయిదు వాహనాలను ఢీకొట్టింది. ఎస్‌యువిలో మంటలు చెలరేగడంతో కారులో ఉన్న నలుగురు వ్యక్తులు కాలి బూడిదయ్యారు. మరణించినవారిలో హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ఆర్యన్ రఘునాథ్ ఓరంపట్టి, అతడి స్నేహితుడు ఫరూక్ షేక్, మరో తెలుగు విద్యార్థి లోకేష్ పాలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవ్‌లుగా గుర్తించారు.

రూపాయి బియ్యానికి ఎసరు?

- సబ్సిడీ బదులు నగదు చెల్లింపు
- డిఆర్ఐ ప్రతిపాదనను పరిశీలిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పేద ప్రజలకు ఎంతో అండగా ఉన్న రూపాయికే కిలో బియ్యం పథకానికి రాష్ట్రంలో ముప్పు పొంచి ఉందా? విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ప్రశ్నకు సమాధానం అవుననే! ఆర్థిక భారం తగ్గించుకునే చర్యల్లో భాగంగా ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ దిశలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (ఎపిఎస్‌డిఆర్ఐ) ప్రభుత్వానికి కొన్ని ప్రతిపాదనలు కూడా చేసినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నుండి అందిన సూచనల మేరకు పలు పథకాలకు డిఆర్ఐ ప్రత్యామ్నాయాలు సూచించినట్లు చెబుతున్నారు. ప్రధానంగా బియ్యం కార్డులకు ఇస్తున్న సబ్సిడీ వల్ల ఖజానాపై పెద్ద ఎత్తున ఆర్థిక భారం పడుతున్నట్లు డిఆర్ఐ నిర్ధారించినట్లు తెలిసింది. ఇంత సబ్సిడీ భరించి బియ్యం సరఫరా చేసే బదులు, ఆ సబ్సిడీ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారునికి చెల్లించాలని (డైరక్ట్ బెనిఫిట్) డిఆర్ఐ ప్రతిపాదించింది. 'లబ్ధిదారునికి చెల్లించే నగదుతో పోలిస్తే సబ్సిడీ కోసం భరించే మొత్తం చాలా ఎక్కువ. అందువల్ల నగదును నేరుగా చెల్లిస్తే ఖజానాపై భారాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చు' అని డిఆర్ఐ తన నివేదికలో సూచించినట్లు తెలిసింది. ఇది అమలులోకి వస్తే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మొత్తానికి అదనంగా ధర ఎంత ఉంటే అంత వినియోగదారుడు చెల్లించి బహిరంగ మార్కెట్‌లో బియ్యం కొనుగోలు చేయాల్సివస్తుంది. ఈ ప్రతిపాదన అమలు పట్ల ప్రభుత్వం లోతుగా పరిశీలిస్తోందని సమాచారం. ఇదే విధానాన్ని ఇతర సబ్సిడీ పథకాలకు వర్తింపచేసే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.



భూముల రిజిస్ట్రేషన్లపై నిఘా

వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు మార్పు చేస్తున్న విధానాల్లో కూడా అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు గుర్తించారు. భూమి వినియోగ మార్పిడి జరగకుండానే కట్టడాలు నిర్మిస్తున్నట్లు తేలిందని డిఆర్ఐ పేర్కొంది. నాలా చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని, అందువల్ల నాలా పన్నులు కూడా తగ్గిపోతున్నాయని చెబుతున్నారు. పలురంగాల్లో జిఎస్‌టిపైనా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, వీటిపైనా దృష్టి సారిస్తే ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవచ్చునని రెవెన్యూ ఇంటలిజెన్స్ విభాగం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

మరికొన్ని సూచనలు

- వినియోగదారులకు లబ్ధి కల్పించకుండా పన్నుల ఎగవేత ద్వారా లబ్ధిపొందుతున్న సంస్థలపై పెనాల్టీలు విధించడం.
- అర్హత లేకపోయినపటికీ పారిశ్రామిక ప్రోత్సహకాలను వినియోగించుకుంటున్న సంస్థలపై చర్యలు
- వాహనాలకు కల్పించే బీమాలో అనేక సంస్థలు అవకతవకలకు పాల్పడుతున్నట్లు డిఆర్ఐ గుర్తించింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక వెబ్ అప్లికేషన్ సిద్ధం చేయాలని ప్రతిపాదించారు.

బుడమేరు కబ్జాలపై సర్వే

- శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళిక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- నాల్గవరోజూ వరద పీడిత ప్రాంతాల్లో పర్యటన



వరద ముంపు బాధితులకు ధైర్యం చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బుడమేరు కబ్జాలపై సర్వే చేయించి, శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికను రూపొందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వరుసగా నాలుగోరోజైన బుధవారం నాడు కూడా ఆయన పర్యటించారు. బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.. అందరికీ ఇంటింటికీ వచ్చి భోజనం అందిస్తారని, ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనతో చెప్పాలని వారిని కోరారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణానదికంటే బుడమేరు వల్లే విజయవాడకు తాజా వరదల్లో ఎక్కువ నష్టం కలిగిందని చెప్పారు. బుడమేరును పెద్ద ఎత్తున ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టినందువల్లే ఈ సమస్య ఏర్పడిందన్నారు. అందువల్లే ఈ కబ్జాలపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనికోసం నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. బుడమేరుకు 2019 తరువాత గండ్లు పడితే వాటిని పూడ్చాలనే కనీస చర్యలు తీసుకోలేదని, దీనివల్ల సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని అన్నారు. అప్పటినుండే ఒకరిద్దరు పెద్ద ఎత్తున కబ్జాలకు పాల్పడిందని చెప్పారు. ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు రాకుండా వార్డు సచివాలయాల వారీగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. రోడ్లు, ఇళ్లను శుభ్రంచేసేందుకు ఫైరింజన్లు తెప్పించామని అన్నారు. ప్రజలు సిద్ధమైతే వెంటనే పరిహారం పంపిణీ చేపడతామని అన్నారు. అలాగే ఎన్యుమరేషన్ కూడా చేయిస్తామని తెలిపారు. కొంతమంది నిత్యావసర వస్తువుల ధరలు పెంచారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం తరుపున బాధితుల కోసం కూరగాయలు అందుబాటులో పెడతామని తెలిపారు. ఎక్కడైనా మృతదేహాలు కనిపిస్తే సమాచారం ఇస్తే వాటిని గౌరవ ప్రదంగా తరలిస్తామని పేర్కొన్నారు సహాయ చర్యల కోసం రెండువేల మంది సిబ్బందిని నియమించామని, ప్రొక్లెయినర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇస్తామని తెలిపారు. రోజుకో మూడుసార్లు ఐవిఆర్‌ఎస్ తెప్పించుకుని కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. నిత్యావసర వస్తువుల పంపిణీకి వెంటనే ఆదేశాలు ఇస్తామని తెలిపారు. ముంపు నేపథ్యంలో ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఒకరోజు వేతనం ఇస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. అటువంటి వారిని అభినందిస్తున్నామని పేర్కొన్నారు.

అందరి ఇళ్ల మాదిరే ...

'అందరి ఇళ్లలోకి నీరు వచ్చింది. అలాగే మా ఇంట్లోకి వస్తాయి. దానివల్ల ఇబ్బందేమిటి' అని చంద్రబాబు ప్రశ్నించారు. వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అద్దె ఇంట్లో ఉంటున్నా ఓర్వలేకపోతున్నారని తెలిపారు. అమరావతి మునిగిపోయింది, అదో శ్మశానమని అంటున్నారని చెప్పారు. తప్పుడు ప్రచారం చేసిన వారు క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఒకపక్క ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సహకరించాల్సిందిపోయి రాజకీయ విమర్శలు చేస్తూ అరాచకం చేయాలని చూస్తున్నారన్నారు.

మానవతా కోణంలో ఆలోచించండి ...
బీమా కంపెనీలకు సూచన

ముంపులో మునిగిపోయి నష్టపోయిన వాహనాల ఇన్సూరెన్స్ చెల్లింపులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మానవతాకోణంలో ఆలోచించి వాహనాలకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయించాలని కోరారు. ఇన్సూరెన్స్ చేసుకున్న ప్రతి వస్తువుకూ చెల్లింపులు ఉండేలా చూడాలని కోరారు. ముంపులో మునిగి ఒకవేళ వాహనాల పత్రాలు పాడైపోతే కంపెనీలే వాటిని తీసి ఇచ్చి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరద ప్రభావిత కృష్ణా, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో గురువారం కేంద్ర బృందం పర్యటించనుంది. నష్టం అంచనాలను రూపొందించనుంది. కేంద్ర హోంశాఖ అదనపు కార్యదర్శి నవీన్‌కుమార్ జిందాల్ (సిఎంఅండ్‌పిఎం) నేతృత్వంలో ఈ బృందం పర్యటించడంతోపాటు బాధితులతో నేరుగా మాట్లాడనుంది. ఈ బృందంలో జాతీయ విపత్తుల నిర్వహన సంస్థ (ఎన్‌డిఎంఎ) సలహాదారు కల్నల్ కెపి సింగ్, కేంద్ర జల సంఘం డైరెక్టర్ సిద్ధార్థ్ మిత్రా, కేంద్ర జల సంఘం హైదరాబాద్ ఎస్‌ఇ ఎం రమేష్‌కుమార్, ఎన్‌డిఎస్‌ఎ సదరన్ జోన్ డైరెక్టరు ఎం గిరిధర్, ఎన్‌డిఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ వివిఎన్ ప్రసన్న సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఒకరోజు పర్యటన అనంతరం సాయంత్రం ముఖ్యమంత్రితో చర్చించనున్నారు.

4,320 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ రోడ్లు కలిపి దాదాపు 4,320 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. ఇందులో ఆర్‌అండ్‌బికి సంబంధించి 3,973 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. ఇందులో 46 ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురికాగా, 10 చోట్ల పునరుద్ధరణ చేశారు. అలాగే 242 సిడి వర్క్‌లు దెబ్బతిన్నాయి. 218 చోట్ల రోడ్లపైకి నీరు చేరి రవాణాకు అంతరాయం కలిగింది. 231 ప్రాంతాల్లో రవాణాకు ఆటంకం కలిగితే 153 చోట్ల రోడ్లను పునరుద్ధరించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 348 కిలోమీటర్ల పంచాయతీ రోడ్లు ధ్వంసమయ్యాయి. 40 చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



సురేష్



శ్రీనివాసరావు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా సురేష్, శ్రీనివాసరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయుల జాబితా-2024ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. అందులో మన రాష్ట్రం నుంచి ఇద్దరు అధ్యాపకులు ఎంపికయ్యారు. వారిలో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కూనాటి సురేష్, కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన ఫిజిక్స్ ఉపాధ్యాయులు మిద్దె శ్రీనివాసరావు ఉన్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకోనున్నారు. సాంఘికం.. సామాజికం నా రెండు కళ్లు అని కూనాటి సురేష్ తెలిపారు. ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలను అనువదించడం, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దీక్ష వెబ్‌సైట్లో కంటెంట్ క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు రావడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. మిద్దె శ్రీనివసారావు మాట్లాడుతూ.. మారుతున్న నూతన పోకడలపై ప్రయోగాత్మక భోదన అవసరమని తెలిపారు. సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తూ భోదన సాగిస్తున్నట్లు తెలిపారు. తనకు ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందని తెలిపారు.



ఉపముఖ్యమంత్రికి అంగీకారపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగులు

ఆక్రమణలను తొలగించాలంటే అనేక అడ్డంకులు

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అక్రమ నిర్మాణాలను తొలగించాలంటే సామాజిక పరిస్థితులు, న్యాయపరమైన అడ్డంకులు అనేకం ఉంటాయని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడమేరును ఆక్రమించి దాని సహజ స్వరూపాన్ని పూర్తిగా నాశనం చేసిన నిర్మాణాల వల్లే విజయవాడకు వరద విపత్తు వచ్చిందన్నారు. నదీ పరివాహక ప్రాంతాలు, డ్రైయిన్లు, వాగులు, వంకలు, చెరువుల్ని ఆక్రమించి ఇష్టానుసారం లేఅవుట్లు వేశారని తెలిపారు. గత కొంతకాలంగా ఈ ఆక్రమణలు సాగుతూనే ఉన్నాయని, గత ప్రభుత్వంలో కనీసం దీనిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవన్నారు. అక్రమ నిర్మాణాన్ని ధ్వంసం చేసే కంటే నిర్మించక ముందే అడ్డుకోవడం ఉత్తమ మార్గమని చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా చేస్తున్న పని సరైనదేనని అభినందించారు. గత వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు నివాస కాలనీలు కట్టబెట్టిందని విమర్శించారు. వైసిపి నాయకులు అనవసరపు మాటలు మానుకొని జేబులో డబ్బును విరివిగా విరాళంగా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సినిమా వాళ్ల దగ్గరకంటే మాజీముఖ్యమంత్రి జగన్ దగ్గరే ఎక్కువ సంపద ఉంటుందని విమర్శించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్, డైరెక్టర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

లంక గ్రామాలు అతలాకుతలం

ఆవలవారిపాలెం వద్ద దెబ్బతిన్న బిటి రహదారి
అరవింద వారధిపై పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రజాశక్తి-భట్టిప్రోలు (బాపట్ల జిల్లా)

కృష్ణా నది వరదలకు బాపట్ల జిల్లాలోని లంక గ్రామాలు అతలాకుతలమయ్యాయి. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో ప్రస్తుతానికి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ నేటికీ అనేక గ్రామాలు నీటిలోనే ఉన్నాయి. వరద ప్రవాహంతో రహదారులు ఛిద్రమయ్యాయి. కొల్లూరు మండలం ఆవలవారిపాలెం గ్రామం వద్ద వరద ఉధృతికి బిటి రహదారి పూర్తిగా దెబ్బతింది. పెద్దపెద్ద గోతులు పడ్డాయి. వరద కొంతమేర తగ్గుముఖం పట్టడంతో పునరావాస కేంద్రాలలో ఉన్న బాధితులు గృహాలకు పయనమయ్యారు. భట్టిప్రోలు మండలం, పెసర్లంక దళితవాడ, పల్లెపాలెం, చింతమోటు కొత్తగూడెం, కొల్లూరు మండలంలో కలవానిపాలెం క్రీస్తులంక, తడికలపూడి, జువ్వలపాలెం గ్రామాల్లో ఇప్పటికీ వరద నీరు ప్రవహిస్తూనే ఉంది. గురువారం నాటికి ఈ వరద నీరు రహదారులపై నుంచి కిందకు దిగే పరిస్థితి ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గత నాలుగు రోజుల నుంచి లంక గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో వరద నీటి తాకిడికి గృహాలపై ఉండి.. చీకట్లో చిన్నపిల్లలతో, వృద్ధులతో మగ్గిపోయామని స్థానికులు వాపోతున్నారు.

వరద నీరు తగ్గుముఖం పట్టడంతో భట్టిప్రోలు మండలం, వెల్లటూరు గ్రామం నుండి ఆహార పదార్థాలను లంక గ్రామాలకు ట్రాక్టర్లపై తరలించి పంపిణీ చేస్తున్నారు. కొల్లూరు మండలం, పెసర్లంక గ్రామం వద్ద కృష్ణానదిపై ఉన్న అరవింద వారధిపై కొట్టుకొచ్చిన చెట్లు, చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈ వారధి ద్వారా సుమారు ఏడు లంక గ్రామాల ప్రజలు ప్రయాణించాల్సి ఉంది. వారధి సమీపంలో ఏర్పడిన గండిని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు యుద్ధ ప్రాతిపదికన పూడ్చి ప్రయత్నం చేస్తున్నారు. ఓలేరు పల్లెపాలెం గ్రామం పూర్తిగా వరద నీటి నుండి బయటపడింది. లంక గ్రామాల్లో వరద నీరు పూర్తిగా తగ్గడానికి మరో రెండు రోజులు పడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు.



వరద తాకిడికి ధ్వంసమైన రహదారి

ఎన్‌జిఒల సాయం రూ.120 కోట్లు

ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్)కి పారిశ్రామికవేత్తలు, ఉద్యోగ సంఘాల నాయకులు విరాళాలు ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విజయవాడలోని కలెక్టరేట్‌లో కలిసి ఈ చెక్కులు, నగదును బుధవారం అందజేశారు. ఎపి ఎన్‌జిఒ ఉద్యోగులు సెప్టెంబరు జీతంలో ఒకరోజు మూల వేతనాన్ని సుమారు రూ.120 కోట్లు విరాళంగా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం ఉద్యోగులు ఒకరోజు మూల వేతనాన్ని అందించారు. ఇందుకు సంబంధించిన అంగీకార పత్రాలను ముఖ్యమంత్రిని కలిసి ఆయా సంఘాల నాయకులు అందజేశారు. బిఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎమ్‌డి బలుసు శ్రీనివాసరావు, రూ.కోటి, సినీ నిర్మాత అశ్వనీదత్ రూ.25 లక్షలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ రూ.25 లక్షలు, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.25 లక్షలు, కాకతీయ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ రూ.25 లక్షలు, ఎల్‌విఆర్ అండ్ సన్స్ క్లబ్ రీడింగ్ కమిటీ సభ్యులు రూ.25 లక్షలు, చుక్కపల్లి రమేష్ రూ.25 లక్షలు, ఎపి ఫౌల్ట్రీ అసోసియేషన్ రూ.25 లక్షలు, ఎంఎస్‌ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యాన విజయనగరం జిల్లా సమాఖ్య తరపున రూ.10 లక్షలు, గుంటూరు క్లబ్ రూ.10 లక్షలు, తెనాలి డబుల్ హార్స్ రూ.10 లక్షలు, ఐఎఎస్ ఆఫీసర్స్ వైవ్స్ అసోసియేషన్ రూ.5 లక్షలు, సిద్ధార్థ వాకర్స్ క్లబ్ రూ.5 లక్షలు, చిలకమర్రి శ్రీనివాసాచార్యులు రూ.1.50 లక్షలు, టిడిపి మహిళా నాయకులు రాయపాటి శైలజ రూ.5 లక్షలు, ఐ నళినీ ప్రసాద్, పొట్లూరి విజయ్‌కుమార్, అల్లూరి అచ్యుతరామరాజు, వల్లభనేని రవి రూ.1 లక్ష చొప్పున అందించారు.

షేక్ బాజీ రూ.50 వేలు, మంత్రి సవిత కుమారుడు తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.21 వేలను ముఖ్యమంత్రిని కలిసి విరాళంగా అందించారు. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి ఆహార పంపిణీ, వాటర్ బాటిల్స్ అందజేశారు. శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు తన నెల జీతాన్ని ప్రకటించారు. గుంటూరు లోటస్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు రూ.10 లక్షలు విరాళాన్ని మంత్రి లోకేష్‌కు అందించారు. వీరితో పాటు ఏలూరుకు చెందిన ప్రవాస భారతీయులు మేకా వినయ్‌బాబు, సామినేని పవన్ రూ.10 లక్షలు, మంగళగిరి సిటీ కేబుల్ ఎమ్‌డి రూ.5 లక్షలు అందించారు. రెండు రాష్ట్రాలకు రూ.5 కోట్లు సహాయం అందిస్తున్నట్లు రామోజీగ్రూప్ ప్రకటించింది. భారత్ బయోటెక్ ఎపి కి రూ. కోటి విరాళం ప్రకటించింది.

పంచాయతీరాజ్ జెఎసి రూ.14 కోట్ల విరాళం

పంచాయతీరాజ్ జెఎసి ఉద్యోగులు ఒకరోజు బేసిక్ వేతనం రూ.14 కోట్లు వరద సహాయ నిధికి అందజేశారు. ఇందుకు సంబంధించిన అంగీకార పత్రాన్ని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు బుధవారం అందించారు. వీరితోపాటు రూరల్ వాటర్ స్కీం ఉద్యోగులు, ఇంజినీరింగ్ ఉద్యోగులు కూడా ఒకరోజు బేసిక్ వేతన అంగీకార పత్రాన్ని ఆయనకు అందజేశారు.

గోదావరికి వరద ఉధృతి

(మొదటిపేజీ తరువాయి)

రోడ్డును సైతం అధికారులు మూసివేశారు. మరో నాలుగు రోజులపాటు విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో వరద కష్టాలు అంతకంతకు పెరిగే అవకాశం ఉంది. 24 గంటలపాటు అధికారుల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు హెచ్చరించాయి.

253 కుటుంబాలను పునరావాస శిబిరాలకు తరలింపు

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని 253 కుటుంబాలను రావికుంట పునరావాస కాలనీకి తరలించారు. ఇప్పటికే కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు ఉధృతికి సమీప పొలాలు నీట మునిగాయి. వేలేరుపాడు మండలంలోని కోయిదా, కట్కూరు, రుద్రంకోట, యడవల్లి తదితర 20 గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. బుధవారం సాయంత్రం నాటికి గడిచిన 24 గంటల్లో ఏలూరు జిల్లా ఆచంట మండలం కోడేరు వద్ద మూడు అడుగులు, యలమంచిలి మండలం బాడవ, చించినాడ, యలమంచిలి, యలమంచిలి లంక, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల పుష్కర ఘాట్ల వద్ద సుమారు రెండు అడుగుల మేర వరద నీరు పెరిగింది. వరద ఉధృతి గురువారం కూడా కొనసాగితే మండలంలోని కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, లచ్చిగూడెం, కుక్కునూరు-ఎ బ్లాక్, బెస్తగూడెం తదితర గ్రామాలు ముంపు బారిన పడతాయి.



దేవీపట్నం మండలం ఇందుకూరుపేట-రావిలంక గ్రామాల మధ్య పొంగి ప్రవహిస్తున్న వినుకొండవాగు, నిలిచిపోయిన రాకపోకలు



విఆర్.పురం మండలం శ్రీరామగిరి వద్ద గుట్టపై గుడారాలు వేసుకుంటున్న ముంపు బాధితులు

అల్లూరి జిల్లాలో గుట్టలపై గుడారాల ఏర్పాటు

గోదావరి ఉధృతి నేపథ్యంలో అల్లూరి జిల్లా శ్రీరామగిరి గ్రామస్తులు సమీపంలోని గుట్టలపై గుడారాలు వేసుకుంటున్నారు. దేవీపట్నం మండలం గొందూరు గ్రామం వద్దగల గండి పోచమ్మ తల్లి ఆలయం పూర్తిగా మునిగిపోయింది.

ఈ ప్రాంతం నుంచి పాపికొండలకు వెళ్లే పర్యాటక బోట్లను నిలిపివేశారు. ఎటపాక మండలం నెల్లిపాక, వీరాయిగూడెం గ్రామాల మధ్య రహదారిపై వరద నీరు చేరడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు మండలం సోకిలేరు వాగు పొంగి ప్రవహిస్తుండటంతో విఆర్.పురం, చింతూరు మండలాలకు చెందిన 50 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట-రావిలంక గ్రామాల మధ్య వినుకొండవాగు పొంగడంతో ఎం.రావిలంక, ముసలిగుంట, నాగంపల్లి కాలనీ, పోతవరం, గంగంపాలెం కాలనీ, దండంగి కాలనీ, దేవారం, పోతుకొండ గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ప్రకాశం బ్యారేజీకి భారీగా తగ్గిన వరద

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. బుధవారం మధ్యాహ్నం ఎగువ నుంచి బ్యారేజీకి 3,43,312 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా 3,43,110 క్యూసెక్కుల నీటిని బ్యారేజి 40 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. కాలువలకు 202 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. నాగార్జున సాగర్, పులిచింతలతోపాటు మున్నేరు, కట్టలేరు నుంచి వరద తగ్గడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, బాపట్ల జిల్లాల పరిధిలో లంక గ్రామాల్లో వరద ప్రభావం తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రమాద హెచ్చరికలను కూడా అధికారులు ఉపసంహరించారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1.99 లక్షల క్యూసెక్కులు వస్తుండగా అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి 1.83 లక్షల క్యూస్కెక్కుల నీరు వస్తోంది. కేవలం 39 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం తగ్గడంతో సాగర్‌కు 26 క్రస్టుగేట్లను పూర్తిగా మూసివేశారు. పులిచింతల జలాశయానికి ఎగువ నుంచి 44,100 క్యూసెక్కుల నీరు వస్తుండగా 16 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో గురువారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజీకి పూర్తిగా వరద తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

శ్రీశైలం గేట్లు మూసివేత

ప్రజాశక్తి -శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా పరివాహక ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం జలాశయం గేట్లను బుధవారం మూసివేశారు. జలాశయ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 883.960 అడుగులకు చేరుకుంది. నిలువ సామర్థ్యం 215.80 టిఎంసిలు కాగా ప్రస్తుతం 209.1579 టిఎంసిలు నమోదైంది. గత నెల 28 నుంచి దాదాపు ఎనిమిది రోజులపాటు గేట్లను ఎత్తి దిగువ నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి అనంతరం సాగర్‌కు 68,414 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ బుడమేరు వరద బాధితులను పరామర్శిస్తున్న షర్మిల

కేంద్రానికి కనిపించడం లేదా?

- వర్షాలు, వరదలతో భారీ నష్టం : షర్మిల

ప్రజాశక్తి - విజయవాడ : భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రంలో తీవ్ర నష్టం వాటిల్లిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఎపి పిసిసి చీఫ్ వై.ఎస్.షర్మిల డిమాండ్ చేశారు. విజయవాడలో సంభవించిన వరదలు కేంద్రానికి కనిపించడం లేదని విమర్శించారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో బుడమేరు వరద బాధితులను బుధవారం ఆమె పరామర్శించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా వరదను, పడవల ధాటికి విరిగిపోయిన గేట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో షర్మిల మాట్లాడుతూ.. ఇక్కడ ఎంపిల మద్దతుతో ప్రధాని అయ్యాననే సంగతిని ప్రధాని మోడీ మరిచారని విమర్శించారు. ఎపి ప్రజల కష్టాలు ఆయనకు కనిపించడంలేదన్నారు. మోడీని మనం నెత్తిన పెట్టుకుంటే మళ్లీమళ్లీ మోసం చేస్తున్నారని విమర్శించారు. బుడమేరు వరద విపత్తుతో భారీ నష్టం వాటిల్లిందన్నారు. వరదల్లో ఇప్పటికే 35 మంది చనిపోయారని, 35 వేల ఇళ్లు దెబ్బతిన్నాయని, ఐదు లక్షల మంది బాధితులుగా ఉన్నారని తెలిపారు. ప్రాణాలు పోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు, నష్టపోయిన ప్రతి ఇంటికీ రూ.లక్ష, వస్తువులు నష్టపోయిన వారి రూ.50 వేలు, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యుత్తు కార్మికుల ముట్టడి వాయిదా

- సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

విద్యుత్తు కాంట్రాక్ట్ కార్మికులు గురువారం తలపెట్టిన డిస్కం కార్యాలయాల ముట్టడిని వాయిదా వేస్తున్నామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ప్రకటించారు. తిరుపతిలో ఈనెల రెండవ తేదీ నుంచి నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అంతకుముందు ఎస్‌పిడిసిఎల్ సిజిఎం హెచ్‌ఆర్‌డి రమాదేవితో పలు అంశాలపై సిహెచ్ నర్సింగరావు, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు, సుమన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు, కుమార్ తదితరులు చర్చించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. విజయవాడ పరిసర ప్రాంతాల్లో కార్మికులు సేవలందించాల్సిన అవసరం ఉందని, ముట్టడి కార్యక్రమాన్ని విరమించాలని, సిఐటియు నేతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నామని, పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఆమె విజ్ఞప్తి మేరకు డిస్కం కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని, రానున్న మూడు వారాలలో సమస్య పరిష్కరించకుంటే తిరిగి పోరాటానికి పూనుకుంటామని నాయకులు హెచ్చరించారు.

భీమిలి తీరంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం (విశాఖపట్నం)



భీమిలి తీరంలో జివిఎంసి అధికారులు కూల్చివేస్తున్న కాంక్రీట్ కట్టడాలు

విశాఖ జిల్లా భీమిలి తీరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలను జివిఎంసి అధికారులు బుధవారం కూల్చి వేశారు. కోస్తా నియంత్రణ మండలి (సిఆర్‌జెడ్) నిబంధనలు ఉల్లంఘించి తీరంలో అవ్యాన్ రియల్టర్స్ ఎల్‌ఎల్‌పి సంస్థ శాశ్వత కట్టడాలు నిర్మించిందని జనసేన కార్పొరేటర్ పిఎల్‌విఎన్ మూర్తియాదవ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసిన విషయం విదితమే. తమ ఆస్తులకు రక్షణ కల్పించాలంటూ సంస్థ ప్రతినిధులు కూడా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన హైకోర్టు జివిఎంసి అభిప్రాయాన్ని కోరింది. కట్టడాలు నిబంధనలకు విరుద్ధమని, సంబంధిత కట్టడాలపై 15 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఎసిపి బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీచ్ ఒడ్డున హోటల్ కోసం వేసిన కాంక్రీట్ పిల్లర్లు, గోడలు, ఇతర నిర్మాణాలను కూల్చివేశారు. సంబంధిత నివేదికను జివిఎంసి అధికారులు సోమవారం హైకోర్టుకు సమర్పించనున్నారు. అయితే, సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి శాశ్వత కట్టడాలు నిర్మించినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అవ్యాన్ రియల్టర్స్ ఎల్‌ఎల్‌పి సంస్థ.. వైసిపి ముఖ్యనేత, అప్పట్లో ఆ పార్టీ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ కుటుంబీకులకు చెందినదిగా స్థానికంగా చర్చ జరుగుతోంది.

వరద బాధితులకు ఆపన్నహస్తం

- సిఐటియు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

విజయవాడ వరద బాధితులకు సాయం అందించేందుకు సిఐటియు తిరుపతిలో చేపట్టిన విరాళాల సేకరణలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తోచిన సాయం అందిస్తూ ఆపన్న హస్తం అందిస్తున్నారు. విరాళాల సేకరణకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, శ్రీవారి మెట్టు వ్యాపారుల యూనియన్ ఆధ్వర్యంలో సహాయ నిధిని సేకరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనా భవనం వద్ద నుంచి భవానీనగర్ సర్కిల్ మీదుగా తీర్థకట్ట, గాంధీరోడ్డు వరకూ షాపుల వద్ద నిధి వసూలు చేశారు. రూ. 25 వేల నిధిని రాష్ట్ర కేంద్రానికి పంపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి, శ్రీవారి మెట్టు వ్యాపారస్తుల సంఘం నాయకులు యుగంధర్, మధు, చిట్టిబాబు పాల్గొన్నారు.

లడ్డు నాణ్యతపై ప్రత్యేక దృష్టి

- టిటిడి ఇఒ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

లడ్డూ నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టామని, శ్రీవారి లడ్డూలు మరింత రుచికరంగా ఉండేందుకు కర్ణాటక కో-ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ నుంచి నందిని నెయ్యి కొనుగోలు చేస్తున్నామని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. బుధవారం తిరుపతి అలిపిరి వద్ద నెయ్యి లారీకి పూజలు చేసి తిరుమలకు పంపారు. ఈ సందర్భంగా జె.శ్యామలరావు మాట్లాడుతూ.. నెయ్యి నాణ్యత పరిశీలించేందుకు టిటిడిలో నూతనంగా అత్యాధునిక ల్యాబొరెటరీ ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒ గౌతమి, సివిఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఇఒ పద్మావతి, నందిని డెయిరీ లైజనింగ్ ఆఫీసర్ మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

జగన్ లండన్ పర్యటన ఉద్దేశమేంటి? : మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లండన్ పర్యటన వెనుక ఉద్దేశం ఏమిటని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కష్టాల్లో ఉన్నా పట్టించుకోకుండా జగన్ లండన్ ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. అక్రమ సొమ్ములను వైట్ చేసుకోవడానికే లండన్ వెళు తున్నారని ఆరోపించారు.

7వ తేదీ వరకు గ్రీవెన్స్ రద్దు

టిడిపి కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమం ఈ నెల 7వ తేదీ వరకు రద్దయిందని ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు తెలిపారు.

అటకెక్కిన గోదావరి డెల్టా ఆధునీకరణ



ఆధునీకరణకు నోచక అధ్వానంగా దర్శనమిస్తున్న ఏలేరు ప్రధాన కాలువ

పాలకుల నిర్లక్ష్యంతో ఏటా ముంపు
భారీగా నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి- ఏలూరు,కాకినాడ ప్రతినిధులు

గోదావరి పశ్చిమ డెల్టా, ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణలో పాలకుల నిర్లక్ష్యంతో ఏటా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. వర్షాలు, వరదల సమయంలో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 5.29 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 11 ప్రధాన కాలువలు, ఉపకాలువల ద్వారా ఈ ఆయకట్టుకు గోదావరి నుంచి సాగునీరందుతోంది. 2007లో అప్పటి ప్రభుత్వం పశ్చిమ డెల్టా ఆధునీకరణ పనులకు రూ.1464.44 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చింది. దాదాపు దశాబ్దన్నర కాలం గడిచినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. రూ.773.53 కోట్లు ఖర్చు చేశారు. 2019 నుంచి 2024 మధ్యకాలంలో డెల్టా ఆధునీకరణకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. దాదాపు రూ.700 కోట్ల పనులకు అతీగతీ లేకుండా ఉంది. ఆధునీకరణ పనుల పూర్తికి అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకుండాపోయింది. దీంతో, పంట కాలువలు పూర్తిగా పూడుకుపోయాయి. చిన్న పాటి వర్షం పడినా వరద నీరు కిందకు పారక పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఏటా 40 వేల నుంచి 50 వేల ఎకరాల్లో పంటలను రైతులు కోల్పోతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జులైలో వరదలకు పశ్చిమగోదారి జిల్లాలో 32 వేల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో రెండు వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురైనట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వరద నీరు తగ్గిన తర్వాత పంట నష్టం పశ్చిమగోదావరి జిల్లాలో 12 వేల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో 400 ఎకరాల్లో ఉన్నట్లు తేల్చి రూ.11 కోట్లు రైతులకు పరిహారం అందించాలని ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుత వర్షాలకు ఏలూరు జిల్లాలో 12 వేల ఎకరాల్లో, పశ్చిమగోదావరి జిల్లాలో 2,200 ఎకరాల్లో పంట ముంపునకు గురైనట్లు ప్రాథమిక అంచనాల్లో తేలింది.

ఆక్రమణల్లో పంట కాలువలు

డెల్టా కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయి. డెల్టాలో బడాబాబులు వందల ఎకరాల్లో చేపల చెరువులు అక్రమంగా తవ్వుతూ పంట కాలువలను పూడ్చేస్తున్నారు. 20 అడుగుల వెడల్పు ఉండే కాలువలు సైతం పది అడుగులకు కుచించుకుపోయాయి.

ఆక్రమణకు గురైన 'ఏలేరు'

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండల పరిధిలో 24 టిఎంసిల సామర్థ్యంతో ఉన్న ఏలేరు ప్రాజెక్టు కింద ఐదు నియోజకవర్గాల్లో 54 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ ప్రాజెక్టు అభివృద్ధికి 500 ఎకరాల వరకూ భూమి సేకరించాల్సి ఉంది. ఇందుకు రూ.300 కోట్లు అవసరం. ఏలేరు ప్రాజెక్టు ఆధునీకరణకు టిడిపి ప్రభుత్వం 2014లో రూ.270 కోట్లు కేటాయించింది. మొదటి విడతగా రూ.129 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. 15 రెగ్యులేటర్లు, 15 ఒటి స్లాబ్ స్లూయిజ్‌లు, 20 పైప్ ఒటి స్లూయిజ్‌లు, ఒక క్రాస్ రెగ్యులేటర్ల నిర్మాణంతోపాటూ కాలువ గట్టు పటిష్టత పనులు నిర్వహించారు. ఆ పనుల్లో నాణ్యతా లోపంతో మళ్లీ సమస్య మొదటికొచ్చింది. 2020లో వచ్చిన వరదలకు ప్రధాన కాలువ పొడవునా 50 వరకూ గండ్లు పడ్డాయి. 20 వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకుపోయాయి. రూ.80 కోట్ల మేర రైతులకు నష్టం వాటిల్లింది. అనంతరం అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం 2వ విడత పనులను పక్కనపెట్టింది. ఫేజ్-1లో మిగిలిన 40 శాతం పనులకు, ఫేజ్-2లో పనులకు రూ.294 కోట్లు కేటాయిస్తామని 2022 జులైలో అప్పటి సిఎం జగన్ హామీ ఇచ్చి గాలి కొదిలేశారు. వంద మీటర్ల వెడల్పు ఉండాల్సిన ఏలేరు ప్రధాన పంట కాలువ ఆక్రమణల వల్ల 20 మీటర్లకు తగ్గిపోయింది. ఆధునీకరణలో భాగంగా ప్రధాన కాలువలను 120 మీటర్లు వెడల్పు చేయాల్సి ఉంది. ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు సుద్దగడ్డ వాగు పొంగి గొల్లప్రోలు మండలంలోని పంటలను ముంచేస్తోంది. రైతులకు భారీ నష్టం వాటిల్లుతోంది. ఏలేరు ఆధునీకరణలో భాగంగా సుద్దగడ్డ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయి.

కాలువల్లో పూడికతో పంట ముంపు

ఆధునీకరణ పనులు పూర్తి కాకపోవడంతో పంట కాలువలు పూడుకుపోయాయి. పలుచోట్ల ఆక్రమణలకు గురయ్యాయి. గుర్రపుడెక్క, కర్ర నాచు, కిక్కిస వంటివి పెరిగిపోతున్నాయి. చిన్నపాటి వర్షాలకు సైతం పంటలు ముంపునకు గురవుతున్నాయి. ఏటా పంట నష్టం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆధునీకరణ పనులు వెంటనే పూర్తి చేయాలి.

-కె.శ్రీనివాస్, ఏపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి



ఏలూరు-కైకలూరు ప్రధాన రహదారిపైకి చేరిన వరద నీరు

'కొల్లేరు'కు పోటెత్తుతున్న వరద నీరు

- బిక్కుబిక్కుమంటున్న లంక గ్రామాల ప్రజలు
- నీటిమట్టం 4 మీటర్లకు చేరితే పెనుప్రమాదమే!
- ఇప్పటికే పలు గ్రామాలకు రాకపోకలు బంద్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

కొల్లేరులోకి వరద నీరు పోటెత్తుతుండడంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. విజయవాడ ఉదంతం నేపథ్యంలో పరిస్థితి ఏ విధంగా మారుతుందోనన్న భయం అక్కడి ప్రజలను వెంటాడుతోంది. కొల్లేరులో నీటిమట్టం నాలుగు మీటర్లకు చేరితే పెను ప్రమాదం తప్పదని అక్కడి ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికే నీటిమట్టం మూడు మీటర్లు దాటడంతో అంతటా హైటెన్షన్ నెలకొంది. కొల్లేరును ఆనుకుని 120 లంక గ్రామాలు ఉన్నాయి. దాదాపు ఐదు లక్షల జనాభా ఇక్కడ నివసిస్తున్నారు. కైకలూరు, దెందులూరు, ఉంగుటూరు, ఉండి వంటి నియోజకవర్గాల పరిధిలో ఈ గ్రామాలు ఉన్నాయి. కొల్లేరులోకి మేజర్, మైనర్, మీడియం మొత్తం 67 డ్రెయిన్ల నుంచి నీరు చేరుతోంది. వరదలకు మేజర్ డ్రెయిన్లు బుడమేరు, తమ్మిలేరు, రామిలేరుతోపాటు ఇతర డ్రెయిన్ల నుంచి వరద నీరు పెద్ద ఎత్తున వస్తోంది. కొల్లేరులోకి చేరిన వరద నీరు ఉప్పుటేరు గుండా 64 కిలోమీటర్లు ప్రయాణించి మోళ్లపర్రు వద్ద సముద్రంలో కలుస్తోంది. ఆకివీడు వద్ద ఉప్పుటేరులోకి 16 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఉప్పుటేరులో మరిన్ని డ్రెయిన్లు కలుస్తుండడంతో కొల్లేరు నీరు లాగడం నెమ్మదిగా ఉంది. ఫలితంగా కొల్లేరు నీటిమట్టం పెరుగుతోంది. ఇప్పటికే పెద్దఎడ్లగాడి, చిన్నఎడ్లగాడి మధ్య ఏలూరు-కైకలూరు ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండవల్లి మండలంలో 14 లంక గ్రామాల ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెనుమాక లంక, నందిగామ లంక, ఇంగిలంపాక లంక, మణుగూరు, కొవ్వాడ లంక వంటి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దఎడ్లగాడి-పెనుమాక లంక రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ బుధవారం కొల్లేరు ప్రాంతంలో పర్యటించారు. వరద తగ్గేవరకు ఎవరూ బయటకు రావొద్దని అప్రమత్తం చేశారు. కొల్లేరులో వరద నీరు వేగంగా బయటకు వెళ్లేందుకు పెద్దఎడ్లగాడి వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టారు.

పంట పొలాలు, చేపల చెరువులపై తీవ్ర ప్రభావం

కొల్లేరును ఆనుకుని ఉన్న ఉంగుటూరు, దెందులూరు, ఉండి వంటి అనేక నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున రైతులు వరి సాగు చేస్తున్నారు. ఈ సాగంతా ఐదో కాంటూరు పైభాగంలోనే ఉంది. కొల్లేరుకు వరద నీరు చేరడంతో ఈ పొలాలన్నీ నీట మునిగే ప్రమాదం ఉంది. కొల్లేరును ఆనుకుని చేపల చెరువులు పెద్ద ఎత్తున సాగవుతున్నాయి. వరద నీరు పెరిగితే చెరువు గట్లకు గండ్లు పడే ప్రమాదం ఉండడంతో ఆక్వా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వరద నీరు చెరువు గట్లను దాటినా చెరువుల్లోని చేపలు బయటకు వెళ్లకుండా చుట్టూ వలలు కట్టే ప్రయత్నం చేస్తున్నారు.

మహిళల రక్షణ ప్రభుత్వ బాధ్యత : ఐద్వా

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను అరికట్టి రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. స్థానిక కెఎస్ఎన్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మహిళల భద్రత అంశంపై బుధవారం నిర్వహించిన సెమినార్ లో రమాదేవి మాట్లాడారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని, సంఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం తప్ప, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని ఆమె విమర్శించారు. కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన దారుణ ఘటన దేశాన్నే కుదిపేసిందన్నారు. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బెంగాల్ ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో బిల్లు తీసుకొచ్చిందన్నారు. గతంలో కేంద్రంలో కూడా కథవా, ఉన్నావ్, హత్రాస్, బిల్‌కిస్ భాను తదితర కేసుల్లో ఇలాగే వ్యవహరించిందని విమర్శించారు. మన రాష్ట్రంలో కూడా మహిళలపై జరిగిన అనేక ఘటనల్లో అధికార యంత్రాంగం, పోలీసులు సక్రమంగా వ్యవహరించలేదని మండిపడ్డారు. నేరాలు జరిగిన సందర్భంలో శిక్షలు త్వరితగతిన పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కెఎస్ఎన్ డిగ్రీ బాలికల కళాశాల విద్యార్థిని మాధురి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సుమన, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, డాక్టర్ ప్రసూన, కెఎస్ఎన్ బాలికల డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాజగోపాల్, అరుణ, ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామల, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న రమాదేవి

కష్టాల సుడిలో కౌలు రైతు

- భారీ వర్షాలు, వరదలతో అపార నష్టం
- కృష్ణాలో 97వేల ఎకరాలు మునక
- భూ యజమానుల పేరుతోనే ఇ-క్రాప్ నమోదు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

అధిక వర్షాలు, వరదలతో కృష్ణా జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో ఇప్పటికీ పంటలు నీటిలో మునిగే ఉన్నాయి. పంట ముంపుపై ప్రాథమిక నివేదికలు రూపొందించిన ఆయా శాఖలు తాజాగా నష్టం అంచనాలను రూపొందించేందుకు కసరత్తు మొదలెట్టాయి. ఈ కెవైసి ప్రామాణికంగా సాగే ఈ గణనలో అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసి నష్టపోయిన కౌలు రైతులకు ఊరట ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి 85,032 ఎకరాలు, వేరుశనగ, పత్తి, చెరకు, మినుము 2745 ఎకరాల్లో, పసుపు, కంద, మునగ, బొప్పాయి, అరటి, తమలపాకు తదితర ఉద్యాన పంటలు 9250 ఎకరాల్లో ముంపుకు గురయినట్లు ప్రాథమిక అంచనా. జిల్లాలోని 75 శాతం విస్తీర్ణంలోని పంటలను రెండు లక్షల మంది కౌలు రైతులు సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 70 వేల మందికి పంట సాగు ధ్రువీకరణ పత్రాలు (సిసిఆర్‌సి) ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నా ఇప్పటికి 56 వేల మందికి మాత్రమే అందాయి. పంట నష్టపరిహారం అందించే క్రమంలో ఇ-క్రాప్, ఇ-కెవైసిలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఇటీవల ఈ క్రాప్ పూర్తయింది. భూ యజమానుల పేరుతోనే పంట భూములకు ఇ-కెవైసి చేశారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో వాస్తవ సాగుదారులను గుర్తించి ఇ-కెవైసి చేస్తేనే కౌలు రైతులకు ఊరట కలుగుతుందని కౌలు రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

ఉద్యాన పంటల్లో కౌలు రైతుకు రెట్టింపు నష్టం

నదీ పరివాహక ప్రాంతాల్లో ఎక్కువగా ఉద్యానపంటలు సాగు చేశారు. మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల, పమిడిముక్కల, తోట్లవల్లూరు, కంకిపాడు తదితర మండలాల్లోని నదీ పరివాహక ప్రాంత భూములకు భూ యజమానులు ముందుగానే కౌలు వసూలు చేశారు. అనేక మంది కౌలు రైతులు ఎకరాకు రూ. 40 వేలు ముందుగానే చెల్లించారు. పసుపు, కంద, అరటి, బొప్పాయి, మునగ, వివిధ రకాల కూరగాయల పంటలు సాగు చేశారు. కంద సాగుకు ఎకరాకు రూ. రెండు లక్షలు, మునగ, బొప్పాయి పసుపుకు రూ. లక్ష వరకు వ్యయం అయ్యింది. వరద ముంపునకు గురవ్వడంతో పంట మొత్తం దెబ్బతింది. సొంత భూములున్న రైతులకన్నా కౌలు రైతులు రెట్టింపు నష్టపోయారు. ఈ భూములు సాగు చేసే కౌలు రైతుల్లో అత్యధికులకు సిసిఆర్‌సి కార్డు లేదు. దీంతో క్షేత్రస్థాయిలో కౌలు రైతులు నష్టపోయినా పరిహారం మాత్రం భూ యజమానికి వెళ్లే పరిస్థితి నెలకొంది.



తోట్లవల్లూరులో నీట మునిగిన వంకాయ తోట

కౌలు రైతులను గుర్తించాలి

పసుపుగట్టి సాంబయ్య, కౌలు రైతు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు మండలం

ఒక ఎకరం కంద, ఎకరం పసుపు కౌలు తీసుకుని సాగు చేశాను. కందకు రూ. మూడు లక్షలు, పసుపుకు రూ. లక్ష ఖర్చు చేశా. వరదకు మొత్తం మునిగిపోయింది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టాను. సిసిఆర్‌సి కార్డు లేదు. కౌలు రైతులను గుర్తించి పరిహారం ఇస్తేనే కొద్దిగా ఊరట దొరుకుతుంది.

ప్రభుత్వం ఆదుకోవాలి

మలిశెట్టి మురళీకృష్ణ, కె. కొత్తపాలెం, మోపిదేవి మండలం,

ఈ ఏడాది మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉందని రెండు ఎకరాల్లో పసుపు పంట సాగు చేశాను. భూ యజమానికి ముందుగానే ఎకరాకు రూ. 40 వేలు చొప్పున 80 వేలు చెల్లించాను. పంట సాగుకు ఎకరాకు రూ. 60 వేలు చొప్పున 1.20 లక్షలు పెట్టుబడి పెట్టాను. రెండు లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న పంట వరదకు మునిగిపోయింది. ముందుగా కౌలు చెల్లించడంతో సాధారణ రైతు కన్నా రెట్టింపు నష్టం వచ్చింది. ప్రభుత్వ ఆదుకోవాలి.

వరద అంచనాలో ప్రభుత్వం విఫలం

కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు

ప్రజాశక్తి-ఉంగుటూరు (కృష్ణా జిల్లా)

భారీ వర్షాల వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలోని వెల్దిపాడు, ఎలుకపాడు, ఉంగుటూరు, ఆమదాలపల్లి తదితర గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. నీట మునిగిన ఇళ్లను, పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుపాను హెచ్చరిక సమాచారం ఉన్నప్పటికీ వరదను అంచనా వేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముందుగానే సరైన అంచనా వేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదని తెలిపారు. వెల్దిపాడు, ఎలుకపాడు గ్రామాలు నీట మునగడానికి అక్రమ అనుమతులతో చేపల చెరువుల నిర్మాణం చేపట్టడమే కారణమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమ చెరువులను తొలగించి భవిష్యత్తులో ఇలాంటి నష్టం జరగకుండా కాపాడాలని కోరారు. నష్టపోయిన పంటలకు ఇ క్రాప్ నమోదుతో సంబంధం లేకుండా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణ స్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వెల్దిపాడులో పర్యటిస్తున్న హరిబాబు

సెబీ చీఫ్‌కు అహంకారం..!


- సమావేశాల్లో అవమానిస్తారు
- పని సంస్కృతి లేదు
- మాధబి పురీపై అధికారుల ఆగ్రహం
- ఆర్థిక మంత్రిత్వ శాఖకు లేఖ

న్యూఢిల్లీ : సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఛైర్‌పర్సన్ మాధబి పూరీ బుచ్ పనితీరుపై ఆ రెగ్యూలేటరీ ఉద్యోగులు, అధికారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమ పట్ల ఆమె అహంకారంగా వ్యవహరిస్తున్నారని సెబీ అధికారులు ఆర్థిక మంత్రిత్వ శాఖకు లేఖ రాశారని ఎకనామిక్స్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. ఇప్పటికే అదానీ విదేశీ సంస్థలతో అంటకాగుతున్నారనే హిండెన్‌బర్గ్ ఆరోపణలకు తోడు ఐసిఐసిఐ బ్యాంక్ నుంచి ఆమె ఇప్పటికీ పారితోషకాలు అందుకుంటున్నారనే కాంగ్రెస్ విమర్శలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మాధాబి.. తాజాగా అధికారుల ఆందోళనతో మరింత చిక్కుల్లో పడ్డారు.

మాధబి నాయకత్వంలో పని సంస్కృతి పూర్తిగా దెబ్బతిందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశాల్లో అరవడం, తిట్టడం, బహిరంగంగా అవమానించడం ఆనవాయితీగా మారిపోయిందని తమ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్ సభ్యులపై అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రతీ నిమిషం తమ సభ్యుల కదలికలను పర్యవేక్షిస్తున్నారని, అవాస్తవ లక్ష్యాలను విధిస్తున్నారన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పరిణామాలు తమ మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని.. పని, జీవితాన్ని సమతూల్యం చేయలేక పోతున్నామని తెలిపారు. ఈ విషయంపై మేనేజ్‌మెంట్‌కు ఫిర్యాదు చేసినా ఏవిధమైన స్పందనా లేకపోవడంతోనే ఆర్థిక మంత్రిత్వ శాఖకు లేఖ రాయాల్సి వచ్చిందని అధికారులు వెల్లడించారు.

పెరిగిన మానసిక సమస్యలు..

మాధబి వ్యవహార తీరు వల్ల తాము మానసికంగా కృంగి పోతున్నామని అధికారులు లేఖలో పేర్కొన్నారు. ఉద్యోగులేం మరమనుషులు కాదని.. కీ ఇవ్వగానే ఎక్కువ పని చేయడానికి అని వారు లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకుముందు కార్యాలయంలో ఉన్న మానసిక ఆరోగ్య సలహాదారు వద్దకు చాలా తక్కువమంది వెళ్లేవారని.. ఇప్పుడు ఆ సంఖ్య పెరిగిందన్నారు. గడిచిన రెండు, మూడేళ్ళ నుంచి సెబీపై ఉద్యోగులకు విశ్వాసం పోతోందన్నారు. భయం పెరుగుతోందని తెలిపారు. సెబీ చరిత్రలోనే ఈ తరహాలో తమ బాస్‌పై అధికారులు బహిరంగంగా ఆందోళన వ్యక్తం చేయడం ఇదే తొలిసారి. పని సంస్కృతిలో భాగంగా సమీక్షా సమావేశాల్లో పలు మార్పులు చేపట్టామని సెబీ పేర్కొనడం విశేషం. కానీ.. అధికారులు, ఉద్యోగులపై ఎలాంటి వేదింపులు జరగడం లేదని ఖండించకపోవడం గమనార్హం.



ఉక్కు ఉత్పత్తిపై నిర్లక్ష్యం వద్దు

- స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిపై యాజమాన్యం శ్రద్ధ చూపాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1301వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరంలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి రామస్వామి మాట్లాడుతూ గడిచిన రెండు నెలలుగా బ్లాస్ట్ ఫర్నేస్-3 ఒకటి మాత్రమే ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. స్థానిక స్టీల్ యాజమాన్యం ఉత్పత్తి విషయంలో ఎటువంటి శ్రద్ధా చూపించడం లేదన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10న రాస్తారోకోలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు కె.గంగాధర్, వీరస్వామి, పిజికె.రాజు, డిఎస్‌విఎస్.శ్రీనివాస్, ప్లాంట్‌లోని వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

బంధన్ ఎంఎఫ్ నుంచి నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్

ముంబయి : బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా బంధన్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ కొత్త ఫండ్‌ను సబ్‌స్క్రిప్షన్ కోసం తెరిచామని.. సెప్టెంబర్ 13తో ముగియనుందని తెలిపింది. తిరిగి నిరంతర క్రయవిక్రయాల కోసం సెప్టెంబర్ 20 నుంచి అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. ఇందులోని కొంత మొత్తాన్ని సెక్యూరిటీస్‌ల్లోనూ పెట్టుబడిగా పెట్టనున్నట్లు పేర్కొంది.

తగ్గిన కాఫీ డే స్టోర్లు

బెంగళూరు : ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న కేఫ్ కాఫీ డే అవుట్‌లెట్లు తగ్గిపోతున్నాయి. 2023-24 చివరి నాటికి స్టోర్ల సంఖ్య 450కి తగ్గినట్లు ఆ సంస్థ తెలిపింది. వాల్యు ఎక్స్‌ప్రెస్ కియోస్క్‌లు కూడా 265కి తగ్గాయని కాఫీ డే తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2023 మార్చి ముగింపు నాటికి 469 కేఫ్స్‌ను కలిగి ఉంది.

సంపాదకీయం


దేనికి సంకేతం...?

ఆర్థిక వ్యవస్థ పనితీరుకు కొలమానంగా భావించే స్థూల దేశీయ ఉత్పత్తి (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్టు-జిడిపి) గణాంకాల్లో వృద్ధి తగ్గుదల నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 తొలి త్రైమాసికానికి సంబంధించిన గణాంకాలను నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీసు (ఎన్ఎస్ఓ) కొద్ది రోజుల క్రితం విడుదల చేసింది. దీని ప్రకారం ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో 6.7 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. గడిచిన పదిహేను నెలల కాలంలో ఇంత తక్కువ స్థాయిలో జిడిపి వృద్ధి నమోదు కావడం ఇదే మొదటిసారి. గత ఏడాది ఇదే కాలంలో 8.2 శాతంగా జిడిపి వృద్ధి ఉంది. రిజర్వు బ్యాంకు అంచనాల కన్నా కూడా ఈ ఏడాది సాధించిన వృద్ధి చాలా తక్కువ. గత సంవత్సరం ఏడాది పొడవునా సగటున 8 శాతం జిడిపి వృద్ధి నమోదు కావడంతో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 7.2 శాతం జిడిపి వృద్ధిని తొలుత ఆర్‌బిఐ అంచనా వేసింది. ఆ తరువాత దానిని సవరించి 7.1 శాతం వృద్ధి ఖాయమని పేర్కొంది. దానికి భిన్నంగా వాస్తవ గణాంకాల్లో గణనీయమైన తగ్గుదల నమోదు కావడంతో భిన్న వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. మరోవైపు స్థూల విలువ జోడింపు (గ్రాస్ వాల్యూ యాడెడ్-జివిఎ) గణాంకాలు కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తగ్గు ముఖం పట్టాయి. జివిఎ 8.3 శాతం నుండి 6.8 శాతానికి తగ్గినట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోడితో పాటు, ఆయన వందిమాగాధులు ప్రతిరోజు ఘనంగా చెప్పుకుంటున్న సమయంలోనే వృద్ధి లెక్కల్లో వేగవంతమైన తిరోగమనం చోటుచేసుకోవడం గమనార్హం.

ఈ పతనానికి గల కారణాలను గుర్తించి సరిదిద్దడానికి బదులుగా మోడీ ప్రభుత్వం సాకులు వెతుకుతోంది. ఎన్ఎస్ఓ గణాంకాలు వెల్లడించిన తరువాత స్పందించిన ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పతనానికి కారణంగా చూపడం విడ్డూరం. ఎన్నికల కోడ్ కారణంగా వివిధ పథకాలపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే వ్యయం గణనీయంగా తగ్గడమే దీనికి ప్రధాన కారణమని ఆయన అన్నారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న పరిస్థితులు మరో కారణమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ కూడా ప్రభుత్వ ఖర్చు తగ్గుముఖం పట్టడం వృద్ధి పతనానికి కారణమని అన్నారు. ఇది ఆర్థిక వ్యవస్థ పురోగతికి ప్రభుత్వ వ్యయం పెరుగుదల కారణమని అంగీకరించినట్టే. కానీ దీనిని అవకాశంగా తీసుకుని ప్రైవేటు భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలని, ప్రభుత్వ రంగ సంస్థల మానిటైజేషన్‌ను మరింత వేగంగా పూర్తి చేయాలన్న సూచనలు 'కార్పొరేట్' మేధావుల నుండి వస్తున్నాయి.

అయితే, వాస్తవం దానికి భిన్నం. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలే ఈ పరిస్థితికి కారణం. ఆ విధానాల కారణంగానే దేశంలో ప్రజల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. దేశంలో పెరుగుతున్న పేదరికాన్ని, ఆకలి కేకలను ఐక్యరాజ్యసమితి నుండి అనేక అంతర్జాతీయ నివేదికలు ఎత్తి చూపాయి. నిరుద్యోగం, ఉపాధి రహిత పరిస్థితులు పెరుగుతున్న తీరును అనేక నివేదికలు వివరించాయి. పెరుగుతున్న నిత్యావసర ధరలు చుక్కలను చూడటం ప్రజానీకానికి రోజూ అనుభవంలో ఉన్నదే! దీనిని నివారించడానికి ప్రభుత్వ ఖర్చును, ముఖ్యంగా పేదల కోసం చేసే ఖర్చును భారీగా పెంచాలని, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎందరో నిపుణులు, ఆర్థికవేత్తలు సూచించినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలుకు నిధుల దిగ్గోతే దీనికి నిదర్శనం! వ్యవసాయ రంగంపైన ఇటువంటి నిర్లక్ష్యాన్నే మోడీ ప్రభుత్వం చూపించింది. కనీస మద్దతు ధర చట్టం కోసం ఏళ్ల తరబడి రైతాంగం చేస్తున్న ఆందోళనలను పట్టించుకోకపోగా, యూరియాతో పాటు ఇతర ఎరువులకు ఇస్తున్న సబ్సిడీ మొత్తంలో కోత పెడుతోంది. అదే సమయంలో వ్యవసాయాన్ని కూడా కార్పొరేటీకరించేందుకు పథకాలు రూపొందిస్తోంది. దేశ వ్యాప్తంగా ప్రజల జీవన ప్రమాణాల్లో పెరుగుతున్న అంతరాలే మోడీ ప్రభుత్వ విధానాల వైఫల్యానికి నిదర్శనం. గణాంకాల్లో మాయాజాలం చేసి బూటకపు వృద్ధిని చూపించినా ఎక్కువ రోజులు ఆ టక్కుటమార విద్యలు వాస్తవాలు వెల్లడికాకుండా ఆదుకోలేవు.

మహనీయుల మాట



నిరంతరం నేర్చుకొనే ఉపాధ్యాయుడే మంచి విద్యావంతులను తయారు చేయగలడు.

- రవీంద్రనాథ్ టాగూర్, విశ్వకవి.

Rabindranath Tagore

సందర్భం

ఒత్తిడిలో ఉపాధ్యాయులు



నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

జాతీయ విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయుడు బోధనా విధులు మాత్రమే నిర్వహించాలి. కాని అనేక బోధనేతర విధులను ప్రభుత్వాలు ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నాయి. ముఖ్యంగా యాప్‌ల భారం ఉపాధ్యాయుడిని బోధనా విధులకు దూరం చేసింది. ఇంటర్నెట్ సరిగ్గా లేని వేలాది గ్రామాలలో ఉపాధ్యాయులు యాప్‌లతో కుస్తీ పట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. వీటితోపాటు నాటి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తనిఖీల పేరుతో చేసిన హడావిడి ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, ఒత్తిడికి గురిచేసింది. తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజులలోనే జీవో నెం.117 రద్దు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇంతవరకు జీవో నెం.117 రద్దు చేయటానికి గాని, తరగతుల తరలింపు చర్యలు రద్దు చేయటానికిగాని ప్రయత్నం జరగలేదు. పైగా 'సర్దుబాటు' పేరుతో ఉపాధ్యాయులకు నూతన సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

'మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ' అంటూ తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవ స్థానం ఇచ్చారు. ప్రాచీన కాలం నుంచి ఇప్పటి దాకా సామాజిక ఉపాధ్యాయులు సమాజాన్ని అధ్యయనం చేసి సమాజ పురోగతికి దోహదపడ్డారు. గౌతమ బుద్ధుడు, సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్, రూసో, కార్ల్ మార్క్స్, లెనిన్, జ్యోతిరావు పూలే, సావిత్రీ భాయ్ పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, గాంధీ మొదలగు వారందరూ సామాజిక ఉపాధ్యాయులే. ఆధునిక యుగంలో విద్య మనిషి విజ్ఞానానికి, పురోగమనానికి దోహదపడింది. ఆధునిక యుగంలో కొత్త ఆవిష్కరణలు, జ్ఞాన విస్తరణ, నూతన తాత్విక దృక్పథాలు, ఆధునిక ప్రజాస్వామిక ధోరణులు, స్వేచ్ఛ-సమానత్వం-సౌభ్రాతృత్వం నినాదాలు విద్యా రంగంలో ఎన్నో మార్పులు తెచ్చాయి. ఈ మార్పులన్నింటిలో తరగతి గది, ఉపాధ్యాయుడు కీలక పాత్ర పోషించారు. ఆధునిక భారత దేశంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి ఎంతో మంది ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభావితం చేశారు. అందు వలన డా॥రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించారు.

విద్యారంగం-ఆర్థిక సంస్కరణలు

భారత స్వాతంత్ర్యం తరువాత అమలులోకి వచ్చిన రాజ్యాంగంలో 45వ నిబంధన ద్వారా ప్రభుత్వం అందరికీ ఉచిత విద్య అందించాలని చెప్పింది. 1950 నుంచి 1990 వరకు భారత దేశంలో, ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్నత, పాఠశాల విద్య మొత్తం ప్రభుత్వమే నిర్వహిస్తూ ప్రజలకు అందించింది. 1947లో 16 విశ్వవిద్యాలయాలు వుంటే 1990 నాటికి 400 విశ్వవిద్యాలయాలు ఏర్పడి, ప్రభుత్వ నిర్వహణలో, సామాజిక న్యాయంతో కొనసాగాయి.



కె.ఎస్.లక్ష్మణరావు

పాఠశాలలు జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్‌గా ఏర్పడి అన్ని తరగతుల ప్రజలు వాటిలో చదువుకున్నారు. రిజర్వేషన్లు అమలు జరిగాయి. గ్రామంలోని పెద్ద కుటుంబాల వారు, పేద కుటుంబాల వారు ఒకే పాఠశాలలో చదువుకున్నారు.

కాని 1991లో ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలు 'సరళీకరణ-ప్రైవేటీకరణ-ప్రపంచీకరణ' భారతదేశంలో పెద్ద మార్పులు తెచ్చాయి. ఈ సంస్కరణలు అన్ని రంగాలపై ప్రభావాన్ని చూపించాయి. విద్యారంగం గత మూడు దశాబ్దాలలో కార్పొరేటీకరణకు, ప్రైవేటీకరణకు గురైంది. విద్య సరుకుగా మారిపోయినది. పరీక్షలు, గ్రేడ్లు, ర్యాంకులు, మార్కులు పరమావధిగా మారాయి. మధ్య తరగతి తల్లిదండ్రుల ఆకాంక్షలను ప్రపంచీకరణ విధానాలు పెంచివేశాయి. విద్యా రంగం సృజనాత్మకత కోల్పోతూ ఉపాధే ప్రధాన అంశంగా మారిపోయింది. సామాజిక శాస్త్రాలు, విజ్ఞాన శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు ప్రాధాన్యతను కోల్పోయాయి. విద్యారంగ వినిమయ సంస్కృతి చుట్టూ ఆకాంక్షలు అల్లుకుపోయాయి. ఈ నేపథ్యంలో విద్యతో పాటు ఉపాధ్యాయుడు తన స్వేచ్ఛను కోల్పోయాడు.

స్వేచ్ఛ లేని ఉపాధ్యాయుడు

భారత జాతి భవిష్యత్తు "తరగతి గది"లో నిక్షిప్తమై ఉన్నదని కొఠారి కమిషన్ పేర్కొన్నది. ఒకప్పుడు ఆ తరగతి గదికి రాజు (రాణి) ఉపాధ్యాయుడే. కాని ఇప్పుడు ఉపాధ్యాయుడు అస్వతంత్రుడు. సిలబస్ తయారీలో, బోధనా పరికరాల తయారీలో అధ్యాపన పద్ధతులలో, పిల్లలకి అనుగుణంగా తరగతి గదిని మార్చుకోవడంలో, పరిసరాలకు తగ్గట్లు ప్రతి దానిని రూపొందించుకోవడంలో ఉపాధ్యాయుడికి ఏమాత్రం స్వేచ్ఛ లేదు. ప్రస్తుతం ఉపాధ్యాయుడి కర్తవ్యం "సిలబస్" పూర్తి చేయడమే. మార్కులు, గ్రేడ్ల గురించి నిరంతరం ఆలోచించడమే ఉపాధ్యాయుడి కర్తవ్యంగా మారిపోయింది. దీనితో ఉపాధ్యాయుడు తెలియకుండానే తన విద్యార్థులకు దూరమై పోతున్నాడు. ఈ మొత్తం ప్రక్రియలో వ్యాపార వినిమయ విలువలకు తప్ప, మానవీయ విలువలకు ఏమాత్రం స్థానం లేకపోవడంతో ఉపాధ్యాయుడు క్రమంగా తన జీవ లక్షణాలన్నీ పోగొట్టుకుంటున్నాడు.

ఆంధ్రప్రదేశ్ విద్యారంగం - ఉపాధ్యాయులు

ఆర్థిక సంస్కరణల తరువాత విద్యారంగంలో కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ పెద్ద ఎత్తున జరిగిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైనది. ఇప్పుడు రాష్ట్రంలోని పాఠశాలల్లో 74 లక్షల మంది పిల్లలు చదువుతుంటే 37 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో, 37 లక్షల మంది ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1,80,000 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు మార్కులు, గ్రేడ్లు, ర్యాంకులు ధ్యేయంగా పనిచేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. మంచి ఉపాధ్యాయులు కూడా పాఠాన్ని సృజనాత్మకంగా బోధించే పరిస్థితులు లేకుండా పోయాయి. సిలబస్ పూర్తి చేయడం, చదివించడమే ధ్యేయంగా మారిపోయింది. పేద పిల్లలు మాత్రమే ఉన్న ప్రభుత్వ బడులలో ప్రతి దానికి ఉపాధ్యాయుడిని బాధ్యుడిగా చేస్తున్నారు.

జీవో నెం 117, యాప్‌ల ఒత్తిడి

గత ప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేసింది. జీవో నెం 117 ద్వారా రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయుడిపై పని భారాన్ని పెంచింది. నూతన విద్యా విధానం-2020 పేరుతో జాతీయ విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా 3,4,5 తరగతులను హై స్కూళ్లకు తరలించింది. ప్రాథమిక స్థాయి నుండి హైస్కూల్ వరకు తెలుగు మీడియం రద్దు చేసి ఇంగ్లీష్ మీడియం మాత్రమే కొనసాగించింది. జీవో నెం. 117 వలన ఉపాధ్యాయ పోస్టులు గణనీయంగా తగ్గిపోయాయి. గత ప్రభుత్వం ఒక్క డిఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది.

జాతీయ విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయుడు బోధనా విధులు మాత్రమే నిర్వహించాలి. కాని అనేక బోధనేతర విధులను ప్రభుత్వాలు ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నాయి. ముఖ్యంగా యాప్‌ల భారం ఉపాధ్యాయుడిని బోధనా విధులకు దూరం చేసింది. ఇంటర్నెట్ సరిగ్గా లేని వేలాది గ్రామాలలో ఉపాధ్యాయులు యాప్‌లతో కుస్తీ పట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. వీటితోపాటు నాటి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తనిఖీల పేరుతో చేసిన హడావిడి ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, ఒత్తిడికి గురిచేసింది. తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజులలోనే జీవో నెం.117 రద్దు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇంతవరకు జీవో నెం.117 రద్దు చేయటానికి గాని, తరగతుల తరలింపు చర్యలు రద్దు చేయటానికిగాని ప్రయత్నం జరగలేదు. పైగా 'సర్దుబాటు' పేరుతో ఉపాధ్యాయులకు నూతన సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

కరోనా అనంతర విద్యార్థుల ప్రవర్తన

కరోనా అనంతరం విద్యార్థుల ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఇవి ఉపాధ్యాయులను కూడా ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు విద్యార్థుల చేతుల్లోకి చేరాయి. గత ప్రభుత్వం విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు చదువు కంటే ఇతర అంశాలపై విద్యార్థులు దృష్టి పెట్టటానికి దోహదపడ్డాయని ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు. బైజూస్ కంటెంట్ విద్యార్థులకు ఉపయోగపడలేదు. దీనితోపాటు విద్యార్థులలో ముఖ్యంగా బాలురలో ఒక నిర్లక్ష్య ధోరణి ప్రస్ఫుటంగా కనబడుతున్నది. విద్యార్థుల వస్త్రధారణ, క్రాపులు మొదలైనవి ఉపాధ్యాయులకు ఆందోళన కలిగిస్తున్నాయి. సోషల్ మీడియా విద్యార్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు, అనగా ఒకరు లేక ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండటంతో తల్లిదండ్రులు గారాబంగా పెంచుతున్నారు. ఉపాధ్యాయులు పిల్లలను మందలించే పరిస్థితి కూడా ప్రస్తుతం లేదు. చాలా మంది ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తన పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల్లో కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరమున్నది. తల్లిదండ్రుల సమావేశాలు కూడా తరచుగా నిర్వహించాలి. వీలైనంత వరకు తల్లిదండ్రుల సమావేశాలు సాయంత్రం ఆరు తరువాత నిర్వహిస్తే ఎక్కువ మంది రావటానికి అవకాశం ఉంటుంది. దీనితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, లక్ష్య నిర్దేశన చేయవలసి ఉంటుంది.

సిలబస్ ఒత్తిళ్లు

రాష్ట్ర ప్రభుత్వం "సిలబస్ విషయంలో నిర్దిష్టమైన వైఖరి అవలంబించలేదు. రాష్ట్రంలో గతంలో ప్రభుత్వ పాఠశాలలు అన్నింటిలో 'స్టేట్ సిలబస్' ఉండేది. గత ప్రభుత్వం మొత్తం సిలబస్‌ను సి.బి.ఎస్.ఇ. సిలబస్‌గా మార్చివేసింది. 1000 పాఠశాలలను కేంద్ర సి.బి.ఎస్.ఇ బోర్డుకు అనుబంధం చేసింది. తరువాత ఐ.బి. అనే సిలబస్‌ను ప్రవేశ పెడతామని గత ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు రాష్ట్రంలో 1000 పాఠశాలలు సి.బి.ఎస్.ఇ బోర్డుకు అనుబంధమై వారి పరీక్షలను రాయాలి. మిగిలిన పాఠశాలలకు స్టేట్ పరీక్షల బోర్డు సి.బి.ఎస్.ఇ సిలబస్‌కు పరీక్షలు నిర్వహించాలి. సి.బి.ఎస్.ఇ సిలబస్‌లో సోషల్ వంటి సబ్జెక్టులకు సిలబస్ చాలా ఎక్కువగా ఉన్నది. ఈ నేపథ్యంలో ఈ సిలబస్ పూర్తి చేయటానికి ఉపాధ్యాయులు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ నిపుణులతో చర్చించి సిలబస్‌పై నిర్దిష్టమైన నిర్ణయాలు చేయాలి.

ప్రైవేటు రంగ ఉపాధ్యాయులు

ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగంలో ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలు పెద్ద సంఖ్యలో విస్తరించాయి. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో వచ్చిన ఒక వ్యాసం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ విద్యా సంస్థల వార్షిక టర్నోవర్ రూ.50 వేల కోట్లు ఉన్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 20 వేల ప్రైవేట్ పాఠశాలల్లో 1,20,000 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరికి ఎటువంటి రక్షణ, సర్వీస్ నిబంధనలు లేవు. వేతనాలు అతి తక్కువగా ఉండి తీవ్రమైన శ్రమ దోపిడికి గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ఇచ్చిన సమయాలలో కూడా ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పని చేయవలసిన పరిస్థితులు ఉన్నాయి. వార్షిక ఇంక్రిమెంటు ఇవ్వాలన్నా, ఉపాధ్యాయ ఉద్యోగంలో కొనసాగాలన్నా ఇంటింటికి తిరిగి పిల్లలను తాను పని చేసే పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు బలమైన ఉపాధ్యాయ సంఘాలున్నాయి. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంతవరకు సంఘటితం కాలేకపోయారు. ప్రభుత్వాలు కూడా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల ప్రయోజనాల పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు కనీసం గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, పి.ఎఫ్ వంటి సౌకర్యాలు, వేతన భద్రత లాంటి సౌకర్యాలు చేపట్టవలసిన అవసరమున్నది. గతంలో జారీ చేసిన జీవో నెం.1ని కచ్చితంగా అమలు చేస్తే ప్రైవేట్ ఉపాధ్యాయులకు కొంత మేలు జరగవచ్చు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమానికి ఒక బోర్డు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ఎ.పి.జె.అబ్దుల్ కలాం, సావిత్రీ భాయ్ పూలే వంటి వారిని స్మరించుకోవటమే కాదు. వారి ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లటానికి కృషి జరగాలి. జాతీయ విద్యా విధానం-2020 విద్యపై కేంద్ర ఆధిపత్యం పెరగటానికి, విద్యారంగ వ్యాపారీకరణకు మరింత దోహదపడుతుంది. దానిని అర్థంచేసుకుని వ్యతిరేకించాలి. ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగ సంస్కరణలకు కారణమైన "సాల్ట్" వంటి ఒప్పందాలను ఉపాధ్యాయులు అర్థం చేసుకుని వ్యతిరేకించాలి. రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన విధంగా "అందరికీ సమాన విద్య, శాస్త్రీయ విద్య" కోసం కృషి జరగాలి.

/వ్యాసకర్త శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083/

విశ్లేషణ

వరదలను నివారించలేమా?

కృష్ణానది విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. అందుతున్న లెక్కల ప్రకారం కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద 11 లక్షల 43 వేల క్యూసెక్కుల నీరు వచ్చింది. 1903, 2009లో వచ్చిన వరద నీటి కంటే ఇది ఎక్కువ. కరకట్ట, ప్రకాశం బ్యారేజి భద్రతల గురించి ప్రభుత్వం, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గేట్ల భద్రత గురించి నిపుణులతో నీటి పారుదల అధికారులు సమీక్షిస్తున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, పార్టీలు, వ్యక్తులు, మానవతా వాదులు వరద ప్రాంత ప్రజలకు సహాయ చర్యలు చేపడుతున్నారు. ఇంకా కృష్ణా, తుంగభద్ర, గోదావరి నదులు పొంగి పొర్లుతున్నాయి. ఇప్పటికే సముద్రంలోకి వందల టిఎంసీల నీరు చేరింది. ఇటీవలే కేరళలో వరదలతో కొండ చెరియలు విరిగిపడి వందల మంది చనిపోయారు. దేశంలో గత పది సంవత్సరాల్లో పది పెద్ద వరదలు వచ్చి వేల మంది ప్రజలు, లక్షల కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అద్భుతమైన పురోగతి సాధించిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వరదలను ఎదుర్కోలేమా? వీటిని అరికట్టి మానవాభివృద్ధికి మళ్ళించలేమా?

మానవ నాగరికతకు నదులే తల్లులు. ప్రపంచంలో ఎక్కడైనా మానవ నాగరికత అభివృద్ధి చెందిందంటే అది నదీ పరివాహక ప్రాంతాల్లోనేనని చరిత్ర చెబుతుంది. మన దేశంలో సింధూ నాగరికత అందులో భాగమే.



వి. రాంభూపాల్

'అప్పిచ్చువాడు, వైద్యుడు, ఎప్పుడు ఎడతెగక పారే ఏరు' వున్న చోటనే జీవించమని మన శతకకారులు ప్రజలకు బోధించారు. నదుల పక్కన వున్నప్పుడు వరదల ప్రమాదాలు సహజం. వాటి నుండి రక్షించుకోవడానికి అనాది నుండి మనుషులు అనేక ప్రయత్నాలు చేసి, ఆనకట్టలు, చిన్న ప్రాజెక్టులు, చెరువులు నిర్మించడంతో పాటు ఆ నీటిని పంట పొలాల వైపు మళ్ళించుకున్నారు. మనవాభివృద్ధిలో, రాజుల విజయ గాథల్లో ఈ నీటి కట్టడాలకు ఎంతో ప్రాముఖ్యత వుంది. కరువుల నివారణకు బ్రిటీష్ వారు భారీ ప్రాజెక్టులు కట్టాల్సి వచ్చింది. స్వాతంత్ర్యానంతరం మరిన్ని ప్రాజెక్టులు నిర్మించుకున్నాం. అయినా దేశంలోని మొత్తం వ్యవసాయ భూమిలో 37 శాతం భూమికి మాత్రమే నికరమైన నీటి పారుదల అవకాశాలు వున్నాయి. 77 ఏళ్ళ స్వాతంత్ర్యం తర్వాత కూడా దేశంలోని 63 శాతం వ్యవసాయ భూమి వర్షం మీద, అరకొర నీటి పారుదల మీద ఆధారపడాల్సి వస్తున్నది. దేశంలో ప్రస్తుతం మొత్తం నీటి వనరులు 1929 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బి.సి.ఎం). ఇందులో 1100 క్యూబిక్ మీటర్లు మాత్రమే మనం వినియోగించుకుంటున్నాం. ఇందులో 433 బి.సి.ఎం లు భూగర్భ జలాలు కాగా, 690 బి.సి.ఎం లు ఉపరితల ప్రవాహాలు. ప్రస్తుత నీటి వాడకం ఇలాగే కొనసాగితే 2030 తర్వాత తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి వస్తుందని నీటి రంగ నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వరదల ద్వారా అందుబాటులోకి వస్తున్న నీటి వాడకానికి ఎంతో ప్రాధాన్యత వుంది.

సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదిక ప్రకారం 2022 నాటికి దేశంలో 5,334 పెద్ద డ్యామ్‌లు ఉన్నాయి. వీటిలో 80 శాతం డ్యామ్‌లు 25 ఏళ్ళ నాటివి కాగా 227 డ్యామ్‌లు వందేళ్ల క్రితానివి. వీటిలో 41 డ్యామ్‌లు వరదల తాకిడిని తట్టుకునే స్థితిని కోల్పోయాయి. 1980 నుండి 2017 మధ్య దేశంలో వచ్చిన 253 వరదల వల్ల 1,26,286 మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు, 1.93 కోట్ల మంది ఆస్తులు నష్టపోయారు. 1953 నుండి 2022 వరకు ప్రతి సంవత్సరం సగటున 1712 మంది మరణించినట్లు, ప్రతి సంవత్సరం రూ.3,612 కోట్ల ఆస్తి నష్టం జరుగుతున్నట్లు జాతీయ విపత్తుల శాఖ లెక్కలు చెబుతున్నాయి. వరదల వల్ల ప్రపంచంలో మరణిస్తున్న వారిలో ఐదవ వంతు మన దేశంలోనే వున్నారు. ఇందుకు ఒక కారణం మన దేశానికి ఎనిమిది వేల కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం వుంది. దేశం మొత్తం భూ విస్తీర్ణంలో 12 శాతం భూమి అంటే 45.64 మిలియన్ హెక్టార్ల భూమి వరదల తాకిడికి గురవుతుందని అంచనా. వరదలను సకాలంలో నివారించగలిగితే ఇందులో దాదాపు 80 శాతం భూమిని వరదల నుండి కాపాడుకోవచ్చు అని వరదలపై 1980లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాతీయ కమిషన్ ప్రభుత్వానికి నివేదించింది. గత ఇరవై సంవత్సరాల్లో 2004లో సునామీ, 2005లో మహారాష్ట్ర, 2008లో బీహార్, 2013లో ఉత్తరాఖండ్, 2014లో కాశ్మీర్, 2015లో చెన్నై, 2018, 2019, 2024లో కేరళ, 2019లో పాట్నా వరదలు ప్రజాజీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఈ వరదలకు గురైన లక్షల కుటుంబాలు తమ జీవిత కాలంలో కోలుకోలేని విధంగా నష్టపోయారు.



మన రాష్ట్రం భారత దేశానికి ఆగ్నేయ ప్రాంతంలో ఉంది. పశ్చిమ, తూర్పు కనుమల పర్వత శ్రేణుల నుండి వచ్చే అనేక నదుల ద్వారా మన రాష్ట్రానికి నీరు చేరుతుంది. కృష్ణా, గోదావరి ప్రధాన నదులతో పాటు, తుంగభద్ర, పెన్నా, వంశధార, నాగావళి నదులు మన రాష్ట్రానికి ప్రకృతి ప్రసాదించిన సహజ నీటి వనరులు. దేశంలో గంగా, గోదావరి, బ్రహ్మపుత్ర తర్వాత కృష్ణా నది పరివాహక ప్రాంతం అతి పెద్దది. మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ మీదుగా 1288 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. మన రాష్ట్ర సాగు నీటి వనరులలో ఈ నది ముఖ్య భూమిక పోషిస్తుంది. మన రాష్ట్రానికి చేరుతున్న కృష్ణా నీటిని పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నాం. 2003 నుండి 2022 వరకు 6501 టీఎంసీల నీరు సముద్రంలో వృధాగా కలిసిపోయింది. మరో ప్రధాన నది గోదావరి. ఇది దేశంలో అతి పొడవైన రెండవ నది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిషా ల మీదుగా 1465 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఈ నది నీటిని కూడా పూర్తిగా ఉపయోగించుకోలేక పోతున్నాము. 2003-2022 మధ్య 43,780 టిఎంసీల నీరు సముద్రంలో కలిసింది. గత 19 సంవత్సరాల్లో ఈ రెండు నదుల నుండి 50 వేల టిఎంసీల నీరు సముద్రంలోకి చేరింది. ఒక టిఎంసీ నీటితో పది వేల నుండి పద్నాలుగు వేల ఎకరాల్లో పంటలు పండించవచ్చు. 50 వేల టిఎంసీలను వ్యవసాయ భూములకు మళ్ళించగలిగితే ఆంధ్రప్రదేశ్ పేరులోనే కాదు, వాస్తవంగా కూడా అన్నపూర్ణ అవుతుంది. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నికర సాగు నీరు అందించవచ్చు. తద్వారా రైతుల ఆదాయం, కూలీలకు పనులతో పాటు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి చెందుతుంది. పాలకులు ఇచ్చే భరోసాలు, నేస్తాలు, వందనాల లాంటి పథకాల కోసం ప్రజలు ఎదురు చూసే స్థితి వుండదు. కానీ గత కొన్ని దశాబ్దాలుగా కొత్త ప్రాజెక్టులను నిర్మించడం కాదు, ప్రస్తుతం వున్న ప్రాజెక్టులనే ప్రభుత్వాలు సక్రమంగా నిర్వహించడంలేదు. వరదలు వచ్చినప్పుడు గేట్లు, డ్యామ్ భద్రత గురించి హడావుడే తప్ప వాటి నిర్వహణకు అవసరమైన నిధులు ఇవ్వడం లేదు. సిబ్బందిని నియమించడం లేదు. ఇందువల్లే 2021లో అన్నమయ్య డ్యామ్ తెగిపోయి అపార నష్టం జరిగింది. పులిచింతల గేటు విరిగిపోయింది. ఇటీవల తుంగభద్ర గేటు కొట్టుకుపోయింది. ఇంకా అనేక ప్రాజెక్టులు ఆందోళనకరంగా వున్నాయి. అయినా మన పాలకులు ప్రాజెక్టుల మీద దృష్టి పెట్టడంలేదు. ప్రధాన పార్టీలు ఒకదానిపై ఒకటి విమర్శలు చేయడానికి వరదలను కూడా ఉపయోగించుకుని తద్వారా తమ రేటింగ్ లెక్కలు వేసుకుంటున్నారే తప్ప, ఈ విపత్తుల వల్ల పోతున్న ప్రాణాలు, నష్టపోతున్న ఆస్తులు, అడుగంటుతున్న వ్యవసాయాన్ని గురించి ఆలోచించడంలేదు.

ప్రకృతి విపత్తులుగా వున్న వరదలను సరైన చర్యలు చేపట్టడం ద్వారా ఎదుర్కోవడమే కాకుండా అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చు అని అనేక దేశాలు రుజువు చేస్తున్నాయి. ఎగువ ప్రాంతం నుండి వచ్చే అధిక నీటి ప్రవాహాలను తట్టుకోవడానికి నదుల ఒడ్డును తగినంత సామర్థ్యంతో ఎప్పటికప్పుడు పరిరక్షించడం, ఆక్రమణలకు గురికాకుండా పటిష్టంగా కాపాడడం, నదీ ప్రవాహాలకు ఏర్పడుతున్న కోతలను సకాలంలో నివారించడం, ప్రాజెక్టులలో పెరుగుతున్న పూడికలను తొలగించడం లేదా సమాంతరంగా మరో ప్రాజెక్టును నిర్మించడం ద్వారా వరదలను అనేక దేశాలు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయి. మన దేశంలో వరదలవల్ల పంటపొలాలే కాదు. పట్టణాలు, నగరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. 2005లో ముంబయి, 2015లో చెన్నై, 2019లో పాట్నా, 2009లో కర్నూలు, ఇప్పుడు విజయవాడలో వచ్చిన వరదల పట్టణ ప్రజల జీవితాలు, పేద, మధ్యతరగతి కుటుంబాలు అనేక కష్టాలకు గురవుతాయి. పట్టణ ప్రాంత వరదలకు సరైన డ్రైనేజీ నెట్‌వర్క్ లేకపోవడం, చెరువులు, కుంటలతోపాటు మురికి కాల్వల ఆక్రమణలు, చెత్త నిర్వహణ సక్రమంగా లేకపోవడం ప్రధాన కారణాలుగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్ నివేదిక తెలిపింది. ఇందుకు ప్రభుత్వాలు, మున్సిపల్, నగర పాలక సంస్థలు చేపట్టాల్సిన చర్యలను సూచించింది. వీటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం కొనసాగుతూనే వున్నది.

వరదలను కూడా మతతత్వ రాజకీయాలకు, మూఢ విశ్వాసాలకు వాడుకునే గ్యాంగ్ సోషల్ మీడియాల్లో పెడుతున్న పోస్టింగ్‌లు మానవత్వం ఉన్న వారందరికి వెగటు పుట్టిస్తుంది. కేరళ వరదలకు ఏనుగు చనిపోవడం కారణమని కేంద్ర బిజెపి నాయకులతో మొదలు, పరివార్ భావజాలం ఎక్కిన సినీనటుల వరకు మాట్లాడారు. వానదేవుడు మా పార్టీలో చేరాడని మన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పదే పదే చెప్పడం, ఫలానా వ్యక్తి ముఖ్యమంత్రి అయితే వర్షాలే రావని లేదా అతివృష్టి వస్తుందని చెప్పడం ద్వారా మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నారు. ఇలాంటి అశాస్త్రీయ భావాలు తాత్కాలికంగా అధికార పీఠాన్ని ఎక్కించగలవేమోగానీ, ప్రజలను కష్టాల సుడిగుండాల నుండి గట్టెక్కించలేవు. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని, సాంకేతికాభివృద్ధిని సక్రమంగా ఉపయోగించడం ద్వారానే ప్రకృతి విపత్తులను ఎదుర్కోగలం. వృధాగా సముద్రంలోకి పోతున్న నీటిని సాగు భూముల వైపు మళ్ళించగలం. ఆ దిశగా కృషి చేయాలని పాలకుల మీద ప్రజా ఒత్తిడి తీసుకు రావాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

కిడ్నీ వ్యాధితో ఒకరు మృతి

ప్రజాశక్తి-గంపలగూడెం (ఎన్‌టిఆర్ జిల్లా)


తిరుపతిరావు(ఫైల్)

కిడ్నీ వ్యాధితో ఒకరు మృతి చెందిన ఘటన ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెంలో చోటుచేసుకుంది. గంపలగూడెంకు చెందిన మూడవత్ తిరుపతిరావు (50) గత ఐదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల వ్యాధి తీవ్రతరం కావడంతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఆయన కుమారుడు బాలరాజు తెలిపారు. ఆయనకు భార్య, కుమారులు ఉన్నారు.

మావోయిస్టు అగ్రనేత మృతి

- రూ.25 లక్షల రివార్డు ఉన్న ఏసోబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


ఏసోబు (ఫైల్)

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు దండకారణ్యంలో బుధవారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత, పార్టీ తొలితరం నాయకుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్, ఏ.దాదా, రణదేవ్ దాదా మృతి చెందారు. ఆయన కేంద్ర కమిటీ సభ్యునిగా, కేంద్ర మిలిటరీ ఇన్‌ఛార్జిగా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ బోర్డర్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఏసోబుపై రూ.25 లక్షల రివార్డు ఉందని దంతేవాడ పోలీసులు తెలిపారు. ఆయనది తెలంగాణ స్వగ్రామం ఉమ్మడి వరంగల్ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం.

ఊచకోతకను వ్యతిరేకించినందుకు గ్రెటా థన్‌బర్గ్ అరెస్టు

కోపెన్‌హాగెన్: గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతకు వ్యతిరేకంగా డెన్మార్క్‌లో జరిగిన నిరసనల్లో పాల్గొన్న ప్రముఖ పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్‌ను డెన్మార్క్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. డెన్మార్క్ రాజధానిలోని యూనివర్సిటీ బిల్డింగ్‌ను వద్ద నిరసనకు నాయకత్వం వహిస్తున్న గ్రెటా థన్ బర్గ్‌తో సహా ఆరుగురిని అరెస్టు చేశారు. బిల్డింగ్ ప్రధాన ముఖ ద్వారాన్ని స్తంభింపజేసినందుకు వందలాది మంది యత్నించడంతో పోలీసులు వీరిలో కొందరిని అరెస్టు చేశారు. వారిలో గ్రెటా థన్ బర్గ్ కూడా ఉన్నారని పోలీస్ శాఖ ప్రతినిధి తెలిపారు.

మోతిలాల్ ఓస్వాల్ నుంచి కొత్త ఫండ్

ముంబయి : మోతిలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఒఎంఎఫ్) కొత్తగా 'మోతిలాల్ ఓస్వాల్ నిఫ్టీ 500 మోమెంటమ్ 50 ఇండెక్స్ ఫండ్' ను ఆవిష్కరించింది. ఈ కొత్త ఫండ్‌లోని నిధులను గడిచిన ఆరు నెలలు, ఏడాదిగా నిఫ్టీ 500లోని రాణిస్తున్న 50 ఇండెక్స్‌ల్లో పెట్టుబడులుగా పెట్టనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. గడిచిన ఏడాది నిఫ్టీ 500 ఇండెక్స్ 75.2 శాతం, ఐదేళ్లలో సగటున 35.9 శాతం చొప్పున రిటర్న్లు ఇచ్చిందని ఆ సంస్థ తెలిపింది.

కరెంట్ ఎకౌంట్ లోటు పెరగొచ్చు : ఇండియా రేటింగ్స్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగియనున్న ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో కరెంట్ ఎకౌంట్ లోటు పెరగొచ్చని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ అంచనా వేసింది. జిడిపిలో కరెంట్ లోటు 1 శాతానికి చేరొచ్చని పేర్కొంది. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో 8 బిలియన్ డాలర్ల (రూ.6.71 లక్షల కోట్లు)తో జిడిపిలో 0.8 శాతంగా కరెంట్ ఎకౌంట్ లోటు చోటు చేసుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో 5.7 బిలియన్ డాలర్లతో జిడిపిలో 0.6 శాతంగా నమోదయ్యింది. భారత్ చేసే ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో పాటు రాబడుల కంటే ఇతర విదేశీ చెల్లింపులు ఎక్కువడం ద్వారా కరెంట్ ఎకౌంట్ లోటు ఏర్పాడుతుంది.

సమస్యల వలయంలో హాస్టళ్లు

- మౌలిక వసతులకు ఆమడ దూరం
- ఇబ్బందుల్లో ఎస్‌సి, ఎస్‌టి హాస్టల్ విద్యార్థులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్


అపరిశుభ్రంగా ఉన్న కుళాయిలు, హాస్టల్ రూముల వద్ద సంచరిస్తున్న పందులు(ఇన్‌సెట్‌లో)

నంద్యాల జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో కొట్టుమిట్టడుతున్నాయి. హాస్టళ్ల నిర్వహణ దయనీయస్థితిలో ఉంది. నంద్యాలలోని బొమ్మల సత్రం పరిధిలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి హాస్టళ్లు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. ఒక వైపు జిల్లా కలెక్టర్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చెబుతున్నప్పటికి క్షేత్ర స్థాయిలో అధికారులకు పట్టడం లేదు. బొమ్మల సత్రం వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతంలో ఉన్న కాలేజీ విద్యార్థుల హాస్టల్ అధ్వాన్నంగా ఉంది. హాస్టల్‌లోనే పందులు సంచరిస్తున్నాయి. హాస్టల్ వార్డన్లు పట్టించుకోకపోవడంతో సంక్షేమ వసతి గృహాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. వసతి గృహాల్లో విద్యార్థులు బట్టలు ఉత్తుకోవాలన్నా కుళాయిల వద్ద సరైన సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూములు అపరిశుభ్రంగా ఉండటంతోపాటు తలుపులు సరిగ్గా లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. టాయిలెట్‌కు బొమ్మల సత్రం పరిధిలో ఉన్న ఆరుబయట ప్రదేశాలు కంపచెట్లు, కుందూనది పరిసరాల్లోకి వెళ్లాల్సిందే. అలాంటి సమయంలో విద్యార్థులు విష పురుగుల బారిన పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కనీసం రోడ్డు మీద నుంచి హాస్టల్‌కు వెళ్లాలంటే సరైన దారి కూడా లేదు.

వర్షాలు పడినప్పుడు విద్యార్థులు బురదలో వెళ్లాల్సిందే. పందులు, బర్రెలు హాస్టల్‌లో సంచరిస్తున్నా వాచ్‌మెన్, సిబ్బంది పట్టించుకునే పరిస్థితిలో లేరనే విమర్శలు వస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల చుట్టు అడవిలా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వం నిర్మించిన టాయిలెట్లు, స్నానపు గదులు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. ఎస్‌సి హాస్టల్ పక్కన ప్రవహిస్తున్న గట్టర్ లీకేజ్ కావడంతో హాస్టల్ వంట రూమ్ పక్కన, విద్యార్థుల నివసించే ప్రదేశాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. వంటశాల, భోజనం చేసే డైనింగ్ హాల్ మరింత అధ్వాన్నంగా మారాయి. జిల్లా సర్వోన్నత అధికారి తమ హాస్టల్‌ను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వైసిపి నేతల పిటిషన్లు కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేతలు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. కనీసం సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు వీలుగా పిటిషన్ల కొట్టివేత ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలన్న వినతిని కూడా తిరస్కరించింది. చంద్రబాబు నాయుడు విపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయన ఇంటి వద్ద జరిగిన గొడవలకు సంబంధించిన కేసులో మాజీ మంత్రి జోగి రమేష్, ఇతరులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను కూడా కొట్టేస్తూ వేర్వేరుగా జస్టిస్ విఆర్ కృపాసాగర్ బుధవారం తీర్పు చెప్పారు. టిడిపి ఆఫీసుపై 2021లో దాడి జరిగిన కేసులో వైసిపి ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, మాజీ ఎంపి నందిగం సురేష్, విజయవాడ నేత దేవినేని అవినాష్ ఇతరులు ముందస్తు బెయిల్ కావాలని పిటిషన్లు దాఖలు చేస్తే వాటిని కొట్టేశారు. పిటిషనర్లు కోరిన విధంగా సుప్రీంకోర్టుకు వెళ్లే వరకు రక్షణనివ్వడం సాధ్యం కాదన్నారు. తీర్పు అమలు నిలుపుదల చేయలేమని తేల్చి చెప్పారు.

విజయసాయి కుమార్తెకు చుక్కెదురు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం, భీమునిపట్నం బీచ్ వద్ద కోస్టల్ రెగ్యులేషన్ జోన్ రూల్స్‌కు వ్యతిరేకంగా నిర్మాణం చేశారంటూ వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారాన్ని సింగిల్ జడ్జి వద్ద తేల్చుకోవాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ప్రకటించింది. భీమునిపట్నం బీచ్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా చేసిన నిర్మాణాలను కూల్చివేయాలంటూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ గతంలో పిల్ దాఖలు చేశారు. నిబంధనలకు వ్యతిరేక నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌ను అప్పుడే హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో అధికారులు ఇచ్చిన కూల్చివేతల నోటీసులను ఎంపి విజయసాయిరెడ్డి కుమార్తె, స్థల యజమాని పెనకా నేహారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారాన్ని సింగిల్ జడ్జి వద్ద తేల్చుకోవాలని బెంచ్ ప్రకటించింది.

నేడు అతి భారీ వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈ నెల 5న గురువారం భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. అల్లూరి, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఎన్‌టిఆర్, పల్నాడు, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని తెలిపింది. కోస్తా జిల్లాల మొత్తంగా ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. అల్పపీడనం ఏర్పడుతున్న నేపథ్యంలో కోస్తా వ్యాప్తంగా వర్షాలు పడతాయని వెల్లడించింది. తెలంగాణ ప్రాంతానికి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

తయారీ రంగంలో భారత్ వెనుకబాటు

- బంగ్లా, వియత్నాంలతో పోటీ పడలేకపోతోంది
- ప్రపంచబ్యాంక్ నివేదిక



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతంగా పురోభివృద్ధి సాధిస్తున్నప్పటికీ అంతర్జాతీయ వాణిజ్యంలో ఆ దేశపు వాటా పెరగడం లేదని ప్రపంచబ్యాంక్ పెదవి విరిచింది. ముఖ్యంగా తయారీ రంగంలో భారత్ వెనుకబాటులో ఉందని, ప్రత్యర్థులైన వియత్నాం, బంగ్లాదేశ్‌లు తక్కువ ఖర్చుతో వస్తువులు, సేవలను ఉత్పత్తి చేస్తూ వాటి ఎగుమతి కేంద్రాలుగా మారుతుంటే భారత్ ఆ దేశాలతో పోటీ పడలేకపోతోందని తెలిపింది. భారతదేశం ఆర్థికంగా పురోగమిస్తున్నప్పటికీ గత దశాబ్ద కాలంలో స్థూల దేశీయోత్పత్తిలో దాని వస్తువులు, సేవల వాణిజ్య వాటా పడిపోతోందని మంగళవారం విడుదల చేసిన నివేదికలో ప్రపంచబ్యాంక్ పేర్కొంది.

దుస్తులు, తోలు, వస్త్రాలు, పాదరక్షలకు సంబంధించిన అంతర్జాతీయ ఎగుమతుల్లో భారత్ వాటా 2013లో 4.5 శాతం ఉంటే 2022లో 3.5 శాతానికి పడిపోయింది. దీనికి భిన్నంగా బంగ్లాదేశ్ ఎగుమతులు 2022లో 5.1 శాతానికి, వియత్నాం ఎగుమతులు 5.9 శాతానికి చేరుకున్నాయని ప్రపంచబ్యాంక్ నివేదిక తెలియజేసింది. భారతీయ ఎగుమతి రంగాలు మూలధనపు ప్రోత్సాహకాలు అందజేస్తున్నప్పటికీ దేశంలోని లక్షలాది నిరుద్యోగులకు ఉపాధి కల్పించలేకపోతున్నాయి. 2012లో ఎగుమతులకు సంబంధించిన రంగాలు మొత్తం ఉద్యోగాలలో గరిష్టంగా 9.5 శాతం కల్పిస్తే 2020లో 6.5 శాతం మాత్రమే కల్పించాయని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ ఏడు శాతం అభివృద్ధిని సాధిస్తుందని ప్రపంచబ్యాంక్ అంచనా వేస్తోంది. ఈ వృద్ధి 2025-26, 2026-27లో 6.7 శాతంగా ఉండవచ్చునని తెలిపింది.

టిడిపి, వైసిపి శ్రేణుల ఘర్షణ

ప్రజాశక్తి-డి.హీరేహాల్

అనంతపురం జిల్లా డి హీరేహాల్ మండలంలోని కళ్లెం గ్రామంలో మంగళవారం రాత్రి టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో పలువురికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామంలో రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని అటుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన అక్కడే ఉన్న టిడిపి నాయకులు ఆటో రాజు, ఆనంద్‌కుమార్‌స్వామి వృద్ధుడిని ఆటోలో ఎక్కించుకొని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండ గా వైసిపి నాయకులు ఆటోకు అడ్డంగా వచ్చారు. దీంతో టిడిపి నాయకులు వారిని అడ్డు తప్పుకోండి అనడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణలో టిడిపి నాయకులు రాజు, ఆనంద్‌కుమార్, ఓబులేసు, వైసిపి నాయకులు జయరామ్, రాజు, ఓబన్న తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో రాజు, జయరామ్, ఆనంద్‌కుమార్‌స్వామి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి కళ్లెం గ్రామం వెళ్లి ఘర్షణకు పాల్పడిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి విచారిస్తు న్నట్లు తెలిపారు. గాయపడిన వారిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదకర చెట్లు కొట్టేయొచ్చు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

మానవాళికి ముప్పు కలిగించే కోనో కార్పస్ చెట్లను కొట్టేయడం మంచిదేనని హైకోర్టు పేర్కొంది. జమ్ము కశ్మీర్‌లో కూడా ఇదే తరహాలో ఒక చెట్లను కొట్టినట్లు ఉదహరించింది. ఒక రకం చెట్ల నుంచి వచ్చే దూది లాంటి పదార్థం బయటకు వచ్చాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని కొట్టించేసిందని తెలిపింది. కోనో కార్పస్ చెట్ల విషయంలో కూడా అలాంటి పరిస్థితి ఉండొచ్చునని అభిప్రాయపడింది. కోనో కార్పస్ చెట్ల కొట్టివేతపై కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు కోనో కార్పస్ చెట్ల కొట్టివేతను తప్పుపడుతూ దాఖలైన పలు పిల్స్‌పై తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది.

నటి జత్వానీ కేసులో జప్తు చేసిన ఆధారాలు భద్రం

ప్రజాశక్తి-అమరావతి

సినీనటి కాదంబరి జత్వానీపై ఇబ్రహీంపట్నం పిఎస్‌లో నమోదైన కేసు సమయంలో జప్తు చేసిన ఆధారాలను భద్రం చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 11న జరుపుతామని, అప్పటి వరకు భద్రం చేయాలని జస్టిస్ బొప్పూడి వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినీనటి కాదంబరి నరేంద్ర కుమార్ జత్వానీ, ఆమె తల్లి తనను బెదిరించి భారీగా వసూళ్లకు పాల్పడ్డారంటూ కె విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై కేసులు నమోదు చేశారు. జప్తు చేసిన ఆధారాలను ధ్వంసం చేయకుండా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ విద్యాసాగర్ దాఖలు చేసిన పిటిషన్‌లో పై ఉత్తర్వులు వెలువడ్డాయి.

అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులు ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి ఏడు కేజీలు గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి వి. రత్న వెల్లడించారు. బుధవారం హిందూపురం పట్టణంలోని అప్ గ్రేడ్ స్టేషన్ లో బిఎస్‌పి మహేష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూపురం ప్రాంతంలో గంజాయి సరఫరాతో పాటు విక్రయాలు ఎక్కువ జరుగుతున్నట్లు సమచారం ఉందన్నారు. దీంతో డిఎస్‌పి మహేష్ ఆధ్వర్యంలో అప్‌గ్రేడ్ స్టేషన్ సిఐ ఆంజినేయులు నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పక్కా సమచారంతో హిందూపురం మండలం గోళాపురం పారిశ్రామిక వాడ ప్రాంతంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బలియా జిల్లా మాత్ యోగింద్ర గిరి గ్రామానికి చెందిన సురేందర్ సింగ్ కుమారుడు సుమంత్ కుమార్ సింగ్, ఇదే రాష్ట్రానికి చెందిన ఝాన్సీ జిల్లా చిర్ గాన్ గ్రామానికి చెందిన హీరలాల్ కుమారుడు రజ్జన్, బీహార్ రాష్ట్రం సహర్స జిల్లా చంద్రియన్ గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ కుమారుడు దీపక్ కుమార్, హిందూపురం పట్టణం సడ్లపల్లికి చెందిన వెంకటరెడ్డి కుమారుడు మురళి మోహన్ రెడ్డి, బీహార్ రాష్ట్రం బసంత్ పూర్ జిల్లా సివన్ గ్రామానికి చెందిన రతన్ రాయ్ కుమారుడు కృష్ణ రాయ్‌ను అరెస్టు చేసి వీరి నుంచి ఏడు కేజీల గంజాయిని, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొన్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

30 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- నెక్ట్స్ వేవ్, ఎన్‌ఎస్‌డిసి వెల్లడి

న్యూఢిల్లీ: స్కిల్ అప్ ఇండియా 4.0 కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 30 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు నెక్ట్స్ వేవ్, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌డిసి) తెలిపాయి. ఇందుకోసం తమ ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమాన్ని యువతలో టెక్ నైపుణ్యాన్ని పెంపొందించేదుకు తీసుకొచ్చినట్లు తెలిపాయి. ఇందులో ఎఐ, ఎంఎల్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ వంటి అధునాతన సాంకేతిక అంశాలను యువతకు నేర్పించనున్నామని నెక్ట్స్‌వేవ్ సిఇఒ రాహుల్ అత్తులూరి తెలిపారు. దాదాపు 5 లక్షల మంది విద్యార్థులకు సాఫ్ట్ వేర్ ఉద్యోగాల్లో స్థిరపడేలా సహాయం చేయనున్నామన్నారు. ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి వారికి నెక్ట్స్ వేవ్ తమ 2 సంవత్సరాల కోర్సు అయిన ఫుల్ స్టాక్, ఎఐ-ఎంఎల్ ప్రోగ్రామ్‌ను ఉచితంగా ఇవ్వనున్నామన్నారు.



టపాసుల గొడౌన్‌లో అగ్ని ప్రమాదం

- ఒకరు మృతి

ప్రజాశక్తి-నెల్లూరు

టపాసుల గొడౌన్‌లో పేలుడు సంభవించడంతో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన నెల్లూరు కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. భవాని టపాసుల గొడౌన్‌లో మంగళవారం అర్ధరాత్రి భారీ శబ్దం రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. నాలుగు ఫైరింజన్లతో వారు మంటలను అదుపుచేశారు. గొడౌన్ వాచ్‌మెన్ సుబ్బయ్య ఘటనాస్థలంలోనే మరణించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ప్రమాదం షార్టు సర్క్యూట్ వల్ల జరిగిందా? లేక మరే ఇతర కారణాల వల్ల చోటు చేసుకుందా? అన్నది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.


కొల్లిపర మండలంలో నేలవాలిన మొక్కజొన్న


దాచేపల్లి మండలం రామాపురంలో దెబ్బతిన్న పత్తిపంట

ఏటా ముంపు... పంటలకు ముప్పు

- కాల్వల, కట్టల నిర్వహణపై తొలగని నిర్లక్ష్యం
- నీటిపారుదల శాఖలో భర్తీ కాని పోస్టులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

నీటి పారుదల శాఖలో గత కొన్నేళ్లుగా కాల్వలు, కరకట్టల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో పంటలకు అపార నష్టం జరుగుతోంది. వేసవిలో చేయాల్సిన మరమ్మతులు జులై వరకు చేపట్టలేదు. జులై, ఆగస్టులో తూతూ మంత్రంగా గుర్రపుడెక్క, తూడాకు పనులు చేపట్టారు. కాల్వలు, కరకట్టలను పరిశీలించాల్సిన లస్కర్లు, ఇఇ, ఎఇల పోస్టులు భర్తీ కాకపోవడంతో పర్యవేక్షణ కురువై ఏటా తుపాన్లు, వరదలకు గండ్లు పడి పైర్లు నీట మునుగుతున్నాయి. గత శనివారం కురిసిన భారీ వర్షం, అనంతరం వచ్చిన వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దాదాపు నాలుగు రోజులపాటు పంటలు నీటిలో తేలియాడాయి. దీంతో, ఎక్కువ నష్టం జరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 200 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా, కేవలం 60 మంది పనిచేస్తున్నారు. ఇంజనీర్ల పోస్టులు భర్తీ కాకపోవడంతో చాలా ప్రాంతాల్లో ఇన్‌ఛార్జుల పర్యవేక్షణ వల్ల ఏ ప్రాంతంలో ఏ సమస్య వచ్చినా తక్షణం స్పందించలేని పరిస్థితి ఉంది. నాలుగు రోజుల పాటు భారీ ముంపులో ఉన్న వరి, పత్తి, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం వరద ప్రవాహం తగ్గడంతో లంక గ్రామాల్లోని ముంపు సమస్య తగ్గినా లంక గ్రామాల వాసులు పునరావాస శిబిరాల్లోనే తలదాచుకుంటున్నారు. మరోవైపు వ్యవసాయ, ఉద్యాన శాఖలతోపాటు వివిధ శాఖల అధికారులు పంట, ఆస్తి నష్టం అంచనాల్లో నిమగ్నమయ్యారు. ప్రాథమిక అంచనాల ప్రకారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లాలో 75 వేల ఎకరాల్లో వరి, పది వేల ఎకరాల్లో పత్తి, రెండు వేల ఎకరాల్లో మిర్చి, నాలుగు వేల ఎకరాల్లో పప్పు దినుసులు, మరో నాలుగు వేల ఎకరాల్లో పసుపు, 30 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. పల్నాడు జిల్లాలో 50 వేల ఎకరాల్లో నష్టం జరిగింది. ఈ జిల్లాలో ఇప్పటి వరకు వరి సాగు పూర్తిగా ప్రారంభం కాకపోవడంతో వరి రైతులకు నష్టం తగ్గింది. పత్తి, మిర్చికి మాత్రం నష్టం వాటిల్లింది. అతి భారీ వర్షాలతోపాటు తీవ్ర స్థాయిలో వరద రావడంతో కాలువలకు గండ్లు పడ్డాయి. దాచేపల్లి నుంచి రేపల్లె వరకు ఉన్న కృష్ణా కరకట్టకు పలు చోట్ల లీకేజీలు ఏర్పడడంతో పటిష్టతపై ఎక్కడికక్కడ రైతులు, స్థానిక అధికారులు దృష్టి పెట్టారు. భారీ వర్షంతోపాటు వాగులు పొంగి ప్రవహించడంతో నీరు బయటకుపోవడం లేదు. మంగళగిరి, తాడికొండ, పత్తిపాడు, తెనాలి, పొన్నూరు, పెదకూరపాడు, గురజాల నియోజకవర్గాల్లోని కృష్ణా తీరం ప్రాంత గ్రామాల్లో పంట నష్టం అధికంగా ఉంది. నష్టం అంచనాలు ఇంకా పూర్తి స్థాయిలో చేపట్టలేదు. నీరు తొలగిన ప్రాంతాల్లోనే నష్టం వివరాలు సేకరిస్తున్నారు. పంటలన్నీ నీటిలో నానుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పెట్టుబడి అంతా నీటి పాలైందని, మళ్లీ పెట్టుబడి పెట్టి సాగు ప్రారంభించాలంటే ఎంతో వ్యయభారంతో కూడినదని వాపోతున్నారు. గత మూడు నెలల కాలంలో గుంటూరు జిల్లాలో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదైంది. గత నెల 31న అతిభారీ వర్షంతో ముంపు సమస్య ఎక్కువైంది. పల్నాడు జిల్లాలోని కృష్ణా తీర ప్రాంతంలో ఒకేసారి 11 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో దాచేపల్లి, క్రోసూరు, బెల్లంకొండ, అచ్చంపేట, అమరావతి మండలాల్లో పంట నష్టం అధికంగా ఉంది. గతేడాది డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుపాను తాకిడికి జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. అయినా, ప్రభుత్వం కాల్వల నిర్వహణపై పర్యవేక్షణ పెంచలేదు.

పట్టణాభివృద్ధితో జలప్రళయం

- ఎత్తులలో మార్పులు..డ్రైనేజీ వ్యవస్థలో రాజీ
- గుజరాత్ వరదలకు ఇవే కారణాలు
- ఐఐటీ గాంధీనగర్ పరిశోధకుల వెల్లడి

అహ్మదాబాద్ : భారీ వర్షాలు గుజరాత్ ముంచెత్తాయి. దీంతో ఆ రాష్ట్రం వరదలతో తీవ్రంగా ప్రభావితమైంది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అయితే, దీనికి తీవ్రమైన వాతావరణ పరిస్థితులతో పాటు మానవ తప్పిదాలు కూడా ఉన్నాయని ఐఐటీ గాంధీ నగర్ (ఐఐటీ-జీఎన్) పరిశోధకులు చెప్తున్నారు. తీవ్రమైన పట్టణాభివృద్ధి, ఎత్తులలో మార్పులు, డ్రైనేజీ నమూనాలలో రాజీ వంటి కారణాలను వారు ఎత్తి చూపుతున్నారు. గతనెల చివరలో కురిసిన కుండపోత వర్షాలకు గుజరాత్‌లోని చాలా ప్రాంతాలు వరదలలో మునిగిన విషయం విదితమే. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలోని 15 జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. అయితే, ఇలాంటి వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల తీరును తక్షణమే మళ్లీ అంచనా వేయాల్సిన అవసరమున్నదని ఐఐటీ-జీఎన్ మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ రీసైలెన్స్ ల్యాబోరేటరీ (ఎంఐఆర్ ల్యాబ్) పరిశోధకులు చెప్తున్నారు. వేగవంతమైన పట్టణాభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థలలో తీవ్రమైన మార్పుల నేపథ్యంలో హైడ్రాలజీ ప్రాధాన్యతను వారు నొక్కి చెప్పారు. పట్టణాభివృద్ధి వ్యూహాలలో హైడ్రాలజీని ప్రధానంగా ఉంచాలని వివరించారు. గుజరాత్‌లో వరదలకు తీవ్రంగా ప్రభావితమైన పట్టణాలలో వడోదర ఒకటి. అయితే, ఇక్కడ వచ్చిన భారీ వర్షాలు గణనీయమైన స్థాయిలో లేకపోయి నా.. పట్టణం వరదలతో ప్రభావితమైందని తెలిపారు. రాష్ట్రంలోని భారీ వర్షాలకు జామ్‌నగర్, మోర్బీ, దేవభూమి ద్వారక, రాజ్‌కోట్, వడోదరలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వరదలతో ఈ జిల్లాలు మునిగిపోయాయి. రోడ్లు చెరువులను తలపించాయి. ట్రాఫిక్, విద్యుత్ సేవలకు అంతరాయం కలిగింది. జనజీవనం స్తంభించింది. అయితే, ఇప్పటికైనా ఈ ప్రకృతి ప్రకోపాన్ని గమనించి ప్రభుత్వాలు అభివృద్ధి విషయంలో నిర్మాణాత్మకంగా ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు. పట్టణాభివృద్ధి మాత్రమే మానవ మనుగడను నిర్ధారిస్తుందనుకుంటే రానున్న రోజుల్లో కష్టాలు తప్పవని వారు హెచ్చరిస్తున్నారు.

మణిపూర్‌లో కేంద్ర బలగాలు విఫలం

- రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించలేకపోయాయి
- వాటిని తొలగించటం ఉత్తమం
- మణిపూర్ బిజెపి ఎమ్మెల్యే విమర్శలు
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ



ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాత్మక ఘటనల విషయంలో కేంద్ర బలగాలపై బిజెపి ఎమ్మెల్యే రాజ్‌కుమార్ ఇమో సింగ్ విమర్శలు గుప్పించారు. కేంద్ర బలగాలు రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించలేకపోయాయని అన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న హింసకు వ్యతిరేకంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆయన అభ్యర్థించారు. పశ్చిమ ఇంఫాల్‌లో తాజాగా దాడులు చేసుకున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కేంద్ర బలగాలున్నప్పటికీ హింస కొనసాగుతుండటం పట్ల ఆయన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశారు. కేంద్ర బలగాలు పని చేయలేవనకుంటే వాటిని ఇక్కడి నుంచి తీసేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఇమో సింగ్.. అమిత్ షాకు లేఖ రాశారు. "మణిపూర్‌లో ఉన్న దాదాపు 60 వేల కేంద్ర బలగాలు శాంతిని పునరుద్ధరించటంలో విఫలమైనట్టు కనిపిస్తున్నాయి. ఒక వేళ ఈ బలగాలు మూగ ప్రేక్షక పాత్ర వహిస్తే, వాటిని తొలగించి ముఖ్యమంత్రి కింద పని చేసే రాష్ట్ర ప్రభుత్వానికి శాంతిభద్రతలు అప్పగించటం శ్రేయస్కరం" అని వివరించారు. అక్రమ సాయుధ తీవ్రవాదులు సృష్టిస్తున్న హింసను కట్టడి చేయటంలో కేంద్ర బలగాల అసమర్థత పైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 15-16 నెలల అశాంతి తర్వాత కూడా పరిస్థితులు చక్కబెట్టకపోవటం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాశ్వత శాంతిని తీసుకురావటానికి, సంఘ ర్షణకు గల మూల కారణాలను పరిష్కరించటానికి భద్రతలో స్థానిక పాలన అవసరమని ఎమ్మెల్యే నొక్కి చెప్పారు. ఏడాదిన్నర పాటు రాష్ట్రంలోని రాష్ట్రంలో కొనసాగుతున్న ఘర్షణలు, శాంతిని నెలకొలిపే విషయంలో కేంద్ర బలగాలపై విమర్శలు స్వంత పార్టీ ఎమ్మెల్యే నుంచే రావటం అధికార బీజేపీకి కొంత ప్రతికూలంగా మారే అవకాశమున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బీజేపీ ఎమ్మెల్యే విమర్శలను బీజేపీ అధిష్టానం, కేంద్రం ఏ విధంగా తీసుకుం టుందో, తర్వాత ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందేనని చెప్తున్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్ ఏం చేసింది : ఖర్గే

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో ఏడాదికిపైగా హింస కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజన్ సర్కార్ అని ప్రచారం చేసుకుంటున్న మోడీ సర్కార్ మణిపూర్‌లో హింసను తగ్గించడానికి ఏం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు? మణిపూర్ హింసపై తాజాగా ఖర్గే బిజెపిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మరోసారి మణిపూర్ అంశాన్ని లేవనెత్తుతూ ఖర్గే బుధవారం ఎక్స్ పోస్టు చేశారు. 'నరేంద్రమోడీ జీ మణిపూర్ హింసాత్మకంగా మారి 16 నెలలు అవుతోంది. కానీ మీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం దానిని తగ్గించడానికి ఏమీ చేయలేదు. ఆ రాష్ట్రంలో ఇప్పటివరకూ శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనేలా, అన్ని వర్గాల ప్రజలలో విశ్వాసాన్ని నింపే చర్యలేవీ తీసుకోలేదు.' అని ఖర్గే పోస్టులో మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వాస్తవానికి మణిపూర్ రాష్ట్ర యంత్రాంగాన్ని స్తంభింపజేయడంలో, అసహ్యకరమైన ప్రకటనలు చేయడంలో మణిపూర్ సిఎం ఎన్. బీరెన్ సింగ్ దోషి కాదా? మీడియాలో విడుదలైన ఆ బుల్లెట్‌ను సిగ్గులేకుండా తప్పించేందుకు రాజీనామా డ్రామా ఆడారు. అయితే అలాంటి వ్యక్తిని సిఎం పదవి నుంచి ఇప్పటికీ ప్రధాని ఎందుకు తొలగించలేదు అని ఖర్గే మోడీని ప్రశ్నించారు. మణిపూర్‌లో 16 నెలలుగా హింస జరుగుతున్నా.. ఇప్పటివరకూ ఆ రాష్ట్రాన్ని ప్రధాని మోడీ సందర్శించలేదు. 'రాష్ట్రంలో అడుగు పెట్టడానికి మీరెందుకు ఇబ్బంది పడుతున్నారు? మీ అహం కారణంగా అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారు. మీ ప్రభుత్వ ర్యాంక్ అసమర్థత, సిగ్గులేనితనం వల్ల అక్కడ శాంతి కోసం నెలకొల్పే ప్రాథమిక చర్యల ప్రక్రియను కూడా ప్రారంభించలేదు అని ఖర్గే అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఇంఫాల్‌లో జరిగిన డ్రోన్ దాడి గురించి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇటీవల ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో క్రౌతుక్ గ్రామస్తులపై ఆదివారం కుకీ తీవ్రవాదులు డ్రోన్‌లు, బాంబులు, అధునాతన ఆయుధాలతో దాడి చేసిన ఘటనను ఈ సందర్భంగా ఖర్గే గుర్తు చేశారు. ఈ విషయంలో కేంద్ర హోం మంత్రి చక్రం తిప్పినట్లున్నారు. బిజెపి నాయకుల ఇళ్లపై కూడా దాడులు జరుగుతున్నాయి. అంతర్గత కల్లోలం కాకుండా, ఇప్పుడు జాతీయ భద్రతకు ముప్పు పొంచి ఉంది అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

చట్టాలను అమలు చేయకపోవడమే అసలు సమస్య

సిపిఐ నేత అన్నీ రాజా



న్యూఢిల్లీ : కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారానికి గురై.. దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన వైద్యుల ఆందోళనల నేపథ్యంలో.. మమతా బెనర్జీ ప్రభుత్వం 'అపరాజిత బిల్లు'ను తీసుకొచ్చింది. లైంగిక దాడికి పాల్పడిన వారికి జీవితఖైదు విధించేలా రూపొందించిన ఈ బిల్లు మంగళవారం అసెంబ్లీలో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై తాజాగా బుధవారం సిపిఐ నాయకురాలు అన్నీ రాజా స్పందించారు. 'చట్టాలను రూపొందించినా వాటిని పకడ్బందీగా అమలు చేయకపోవడమే దేశంలో ప్రధాన సమస్య. భారత పార్లమెంట్ మహిళల గౌరవాన్ని కాపాడేందుకు ఎన్నో చట్టాలను ఆమోదించింది. మీడియాలో ఏ అంశం ప్రధానంగా వెలుగు చూసినా ఆపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది. దాన్ని నియంత్రించడం కోసం మనం కొత్త చట్టాలను చేయడమో, లేదా.. వాటిని సవరించడమో చూస్తుంటాం. అయితే, చేసిన చట్టాలను సరిగ్గా అమలు చేయకపోవడమే అసలు సమస్య. చట్టాల అమలుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు రాష్ట్రాలకు లేకపోవడం మరో ప్రధాన అవరోధం' అని ఆమె అన్నారు.

టెస్టుల్లో పాకిస్తాన్ ర్యాంక్ పతనం

- ఐసిసి టెస్టు ర్యాంకింగ్స్

దుబాయ్: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్ట్ సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన పాకిస్తాన్ జట్టు.. తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లోనూ పడిపోయింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో బంగ్లాదేశ్ తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకోగా.. పాకిస్తాన్ 8వ స్థానానికి పడిపోయింది. షాన్ మసూద్ నేతృత్వంలోని పాక్ టెస్ట్ జట్టు ఐసిసి ర్యాంకింగ్స్‌లో 1965 తర్వాత తొలిసారి దారుణంగా పడిపోయింది. రావాల్పిండిలో జరిగిన తొలి టెస్టులో బంగ్లా పది వికెట్ల తేడాతో నెగ్గగా... రెండో టెస్టులో ఆరు వికెట్ల తేడాతో పాక్‌పై గెలుపొందింది. బంగ్లా చేతిలో ఓటమి వల్ల పాకిస్తాన్ టెస్టు ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు పడిపోయినట్లు ఐసిసి ప్రకటించింది. ఆరో స్థానంలో ఉన్న పాకిస్థాన్ వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోవడంతో 8వ ర్యాంక్‌కు దిగజారింది. ఇక 76 రేటింగ్ పాయింట్లతో విండీస్ తర్వాత పాక్ నిలిచింది. రెండు విక్టరీలతో 13 రేటింగ్ పాయింట్లు సాధించినా.. బంగ్లాదేశ్ మాత్రం 9వ స్థానంలో కొనసాగుతోంది. టెస్టు ర్యాంకింగ్స్‌లో ఇండియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

బాబర్ అజామ్ ర్యాంక్ పతనం...

పాక్ మాజీ టెస్టు కెప్టెన్ బాబర్ అజామ్ టెస్ట్ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లోనూ పడిపోయాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 64 పరుగులే చేశాడు. దీంతో ఐసిసి టెస్టు ర్యాంకింగ్స్‌లో బాబర్ అజామ్ ఐదేళ్ల తర్వాత టాప్-10లో చోటు కోల్పోయాడు. తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో బాబర్ మూడు స్థానాలు దిగజారి 12వ స్థానంలో నిలిచాడు. 2019 డిసెంబర్‌లో అతడు 13వ ర్యాంకులో ఉన్నాడు. ఆ తర్వాత టాప్ 10లోకి వచ్చాడు. ప్రస్తుతం పాక్ నుంచి మహ్మద్ రిజ్వాన్ (10వ స్థానం) ఒక్కడే టాప్-10లో ఉన్నాడు. భారత ఆటగాళ్లు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ వరుసగా ఆరు, ఏడు, ఎనిమిది స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇటీవల లార్డ్స్‌లో శ్రీలంకపై రెండు సెంచరీలు చేసిన ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ (922 పాయింట్లు) అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. న్యూజిలాండ్ బ్యాటర్లు కేన్ విలియమ్సన్ (859) రెండో స్థానంలో, డారిల్ మిచెల్ (768) మూడో స్థానంలో నిలిచారు. ఆస్ట్రేలియా క్రికెటర్ స్టీవ్ స్మిత్ (757) ఒక స్థానం మెరుగై నాలుగో స్థానం దక్కించుకున్నాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (753) ఐదో స్థానంలో ఉన్నాడు.

వయస్సు తొంభై.. అయితేనేం..
ప్రజాపోరాటానికి తేతారి దేవి సై..

పాట్నా : దాదాపు 90 ఏళ్ల వయస్సులోనూ తేతారి దేవి ప్రజాపోరాటంలో ముందు వరసలో నిలిచి అందరికి స్ఫూర్తిగా నిలిచారు. బొగ్గు విద్యుత్ ప్లాంట్ కోసం బలవంతంగా భూ సేకరణ చేయడానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. భూసేకరణకు నిరసనగా బుధవారం బీహార్‌లోని బక్సర్ కలెక్టరేట్ వరకూ సంయుక్త కిసాన్ మోర్చా నిర్వహించిన మార్చ్‌లో చౌసా గ్రామానికి చెందిన తేతారి దేవి తోటి గ్రామస్థులతో కలిసి పాల్గొన్నారు. విద్యుత్ ప్లాంట్ కోసం ఈ గ్రామంలో వందల ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరిస్తోంది. దీన్ని గ్రామస్తులు ప్రతిఘటిస్తున్నారు. దీంతో మార్చి 20న గ్రామంపై పోలీసులు క్రూరంగా దాడి చేశారు.

ఈ దాడిలో తేతారి దేవి చేయి విరిగిపోయింది. అయినా సరే .. బుధవారం మార్చ్‌లో పాల్గొన్నారు. ఈ మార్చ్‌లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఇతర నాయకులు పాల్గొన్నారు. మార్చ్‌లో జరిగిన పోలీసుల దాడిపై ఉన్నతస్థాయి విచారణ కోసం కూడా నాయకులు డిమాండ్ చేశారు.


కిసాన్ మోర్చా నిర్వహించిన మార్చ్‌లో తోటి గ్రామస్థులతో పాల్గొన్న తేతారి దేవి

తెలుగు రాష్ట్రాలకు కేంద్రం తక్షణమే సహాయం చేయాలి

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారీ వర్షాలు, వరదలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రాణనష్టం, పంటనష్టం, పనినష్టం, ఆస్తినష్టం అపరంగా జరిగిందని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే వరద సహాయం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. విపత్తు నిర్వహణ నిధులున్నా కేంద్రం వరద సాయం అందించడంలో అలసత్వం వహిస్తుందని, వెంటనే నిధులు విడుదల చేయాలని అన్నారు. ఈ మేరకు బుధవారం నాడిక్కడ ఏపి, తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేంద్ర బృందాలను వెంటనే తెలుగు రాష్ట్రాలకు పంపించి, జరిగిన నష్టంపై అంచనా వేసి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో ప్రధాన మంత్రి సహాయ నిధికి కోట్ల రూపాయల విరాళాలు వచ్చాయని, వాటిని రాష్ట్రాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయిన వ్యవసాయ, ఇతర పేద కుటుంబాలకు తక్షణ సాయంగా రూ. 50 వేలు, 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన వరి పంటకు ఎకరానికి రూ.25 వేలు, పత్తి వంటి వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50 వేలు సాయం ఇవ్వాలని కోరారు. చనిపోయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ. 50 లక్షల సాయం అందించాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి వరదలను విపత్తుగా చూడకుండా రాజకీయ కోణంలో చూస్తున్నారని విమర్శించారు. విపత్తు సంభవిస్తే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏపి, తెలంగాణలో పర్యటించలేదుగాని, మత ఘర్షణలు రెచ్చగొటెందకు తెలంగాణలో విమోచన దినం పేరుతో అమిత్ షా పర్యటన చేయడం దారుణమని దుయ్యబట్టారు.

నాగాలాండ్‌లో విరిగిపడిన కొండచరియలు

- ముగ్గురు మృతి

కొహిమా : నాగాలాండ్‌లో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన ఘటనలో ముగ్గురు మరణించారు. ఈ ఘటన మంగళవారం రాత్రి 11.00 గంటలకు జరిగింది. వరుసగా కొండచరియలు విరిగిపడటంతో దిమాపూర్ నుండి నాగాలాండ్ రాజధాని కొహిమా మధ్య జాతీయ రహదారి 29 ధ్వంసమైంది. ఇది అసోం, నాగాలాండ్ మరియు మణిపూర్‌లను కలిపే కీలక హైవే. ఈ జాతీయ రహదారిపై ఫెరిమా నుండి పగ్లా పహార్ ప్రాంతా మధ్య సుమారు 500 మీటర్ల మేర మట్టి, రాళ్లతో మూసుకుపోయిందని అధికారులు తెలిపారు.

ఈ ఘటనపై నాగాలాండ్ ముఖ్యమంత్రి నెయిఫియు రియో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కాగా, 2017 నుంచి 2024 జులై మధ్య ఈశాన్య రాష్ట్రాల్లో592 కొండచరియలు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని జులై 31న పార్లమెంటుకు సమర్పించిన నివేదిక పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ నుండి జులై వరకు 196 ఘటనలు ఉన్నట్లు నివేదిక తెలిపింది.

త్రిపురలో శాంతి ఒప్పందం

న్యూఢిల్లీ : తీవ్రవాద గ్రూపులు ఎన్ఎల్ఎఫ్‌టి, ఎటిటిఎఫ్, కేంద్రం, త్రిపుర ప్రభుత్వం మధ్య శాంతి ఒప్పందం కుదిరింది.త్రిపురలో హింసకు స్వస్తి చెప్పి, శాంతిని నెలకొల్పడానికి ఉద్దేశించిన ఈ ఒప్పందంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమక్షంలో సంతకాలు జరిగాయి. మెమోరాండం ఆఫ్ సెటిల్మెంట్‌పై సంతకాల సమయంలో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా, హోం శాఖ సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, ఈశాన్య ప్రాంతంలో శాంతి, అభివృద్ధికి మోడీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చిందని చెప్పారు. ఈశాన్యప్రాంతంపై కుదిరిన శాంతి ఒప్పందాలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2500కోట్ల అభివృద్ధి ప్యాకేజీ ఈశాన్యంలో అమలైందని చెప్పారు. ఈశాన్య ప్రాంతాన్ని తీవ్రవాదం, హింస, ఘర్షణల విముక్త ప్రాంతంగా మార్చాలన్న మోడీ దార్శనికతను అమలు చేయడానికి కేంద్ర హోం శాఖ అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. మోడీ నేతృత్వంలో ఈశాన్య ప్రాంతానికి సంబంధించి 12 కీలక ఒప్పందాలు చేసుకోగా వాటిలో త్రిపురకు చెందినవి మూడున్నాయన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు పెన్షన్ నిల్

- హిమాచల్‌ప్రదేశ్‌లో బిల్లు

షిమ్లా: పార్టీ ఫిరాయింపులపై హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీలు మారిన ఎమ్మెల్యేలకు పెన్షన్ సదుపాయాన్ని నిలిపివేయనుంది. దీనికి సంబంధించిన సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ బుధవారం ఆమోదం తెలిపింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటును ఎదుర్కొన్న ఎమ్మెల్యేలకు ఈ కొత్త నిబంధన వర్తించనుంది. ఫిరాయింపులను అరికట్టేందుకు హిమాచల్‌ప్రదేశ్ శాసనసభ (సభ్యుల పింఛన్లు, అలవెన్సులు) సవరణ బిల్లు - 2024ను రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం బుధవారం ఓటింగ్ నిర్వహించి ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది. "ఏదైనా ఒక సమయంలో ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటును ఎదుర్కొన్న శాసనసభ్యులు ఇకపై పింఛను పొందే వెసులుబాటు ఉండదు" అని ఈ బిల్లులో పేర్కొన్నారు.హిమాచల్‌ప్రదేశ్ చట్టాల ప్రకారం.. ఐదేళ్ల కాలం పాటు ఎమ్మెల్యేగా పనిచేసిన వారికి నెలకు రూ.36వేల పింఛను ఇస్తున్నారు. ఐదేళ్లకు మించి పదవీకాలం ఉన్న ఎమ్మెల్యేలకు ప్రతి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున అదనంగా పెన్షన్ అందజేస్తున్నారు.

రాహుల్‌ని కలిసిన వినేష్ ఫోగాట్, బజరంగ్ పునియా

- హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై ఊహాగానాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీని రెజ్లర్లు బజరంగ్ పునియా, వినేష్ ఫోగాట్ కలిశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు స్టార్ గ్రాప్లర్లను కాంగ్రెస్ బరిలోకి దించవచ్చనే ఊహాగానాల మధ్య బుధవారం నాడిక్కడ రాహుల్ గాంధీని కలవడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. భేటీకి సంబంధించిన ఫొటోను కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. 'వినేష్ ఫోగాట్, బజరంగ్ పునియా ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌ను కలిశారు' అంటూ ట్వీట్ పెట్టింది. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్‌గా మారింది. దీంతో వినేశ్‌తోపాటూ పునియా కూడా కాంగ్రెస్‌లో చేరవచ్చని అంతా భావిస్తున్నారు. హర్యానా ఎన్నికల్లో వీరిని పోటీకి దింపే అవకాశం లేకపోలేదంటూ చర్చించుకుంటున్నారు.

పునియా, ఫోగాట్‌లను కాంగ్రెస్ రంగంలోకి దింపుతుందా? లేదా? అనే దానిపై గురువారం నాటికి దానిపై స్పష్టత వస్తుందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి హర్యానా ఇన్‌ఛార్జ్ దీపక్ బబారియా అన్నారు. హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకునే ప్రతి ఒక్కరినీ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఫోగట్ పారిస్ ఒలింపిక్స్ నుండి దేశానికి తిరిగి వచ్చినప్పటి రోహ్‌తక్ ఎంపి దీపేందర్ హుడా ఢిల్లీలోని ఐజిఐ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని ఆమెకు విజయానికి చిహ్నంగా 'హనుమాన్ గద'తో స్వాగతం పలికారు.


రాహుల్‌ని కలిసిన ఫోగాట్, పునియా

కాగా, హర్యానాలోని 90 స్థానాలకు గాను 66 స్థానాలకు అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ మంగళవారం వరకు క్లియర్ చేసింది. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ఒకటి రెండు రోజుల్లో వెలువడనుంది. హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5న పోలింగ్, అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2023లో మాజీ బిజెపి ఎంపి, అప్పటి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలపై పునియా, ఫోగాట్ నిరసనలో అగ్రభాగాన నిలిచారు. ఆ ఆందోళనకు ఎంపి దీపేందర్ మద్దతు ఇచ్చారు.

మధ్యప్రదేశ్‌లో ఆటవిక రాజ్యం

- మహిళపై సామూహిక లైంగికదాడి
- బెల్టుతో ఇష్టం వచ్చినట్టు కొట్టిన దుర్మార్గులు
- హైకోర్టు ఆదేశాలిచ్చిన 19 రోజులకు చర్యలు

న్యూఢిల్లీ : దేశంలో చట్టాలు మారినా, నేరస్థులకు శిక్షలు పడినా దేశంలో మహిళలపై దారుణ ఘటనలు మాత్రం ఆగటం లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆటవిక రాజ్యం నడుస్తోందనటానికి తాజా ఘటనలే ఉదాహరణ. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఒక మహిళపై ఐదుగురు సామూహిక లైంగికదాడికి ఒడిగట్టారు. బాధితురాలిని నగ్నంగా డ్యాన్స్ చేయాలంటూ బలవంతం చేశారు. ఈ ఏడాది జూన్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన ఎఫ్ఐఆర్ ఇప్పుడు నమోదైంది. మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కదిలారు. సదరు బాధితురాలి ఫిర్యాదును 90 రోజుల్లోగా పరిష్కరించాలని న్యాయస్థానం ఆదేశించిన 19 రోజుల తర్వాత పోలీసులు నిందితులపై కేసు నమోదు చేయటం గమనార్హం. సాక్ష్యాల ఆధారంగా ఈ కేసులో తగిన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) అభినయ్ విశ్వకర్మ అన్నారు.

జూన్ 11న నిందితులు తనపై దారుణానికి ఒడిగట్టారని బాధితురాలు కనడియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితులు తనను బలవంతంగా ఒక గోడౌన్‌కు తీసుకెళ్లారనీ, వారు అక్కడ తనపై పాశవిక చర్యకు దిగారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నది. తనను బెల్టుతో కొట్టారనీ, దాదాపు అర్ధగంట పాటు నగ్నంగా డ్యాన్స్ చేయాలంటూ బలవంతం చేశారని ఎఫ్ఐఆర్‌లో బాధితురాలు వివరించింది. ఈ కేసు ఇప్పుడు రాజకీయంగా దుమారం రేపుతున్నది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌ల మధ్య మాటల దాడి జరుగుతున్నది. ఎఫ్ఐఆర్ దాఖలు ఆలస్యానికి బీజేపీ నుంచి వచ్చిన ఒత్తిడే కారణమని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి నీలభ్ శుక్లా ఆరోపించారు. నిందితుల్లో ఒకరికి బీజేపీతో సంబంధాలున్నాయని తెలిపారు. అయితే, నిందితులెవరైనా బాధితురాలికి బీజేపీ ప్రభుత్వంలో తప్పక న్యాయం జరుగుతుందని అధికార పార్టీ స్పందించింది. మణిపూర్, యూపీ, మధ్యప్రదేశ్.. ఇలా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దారుణాలు పెరిగిపోతున్నాయని సామాజికవేత్తలు, మహిళా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేరాలను అదుపు చేసి, మహిళలకు భద్రతను కల్పించటంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనలను కట్టడి చేయటంలో విఫలమవుతున్న బీజేపీ ప్రభుత్వాలు.. 'బేటీ బచావో, బేటీ పడావో' అని సందేశాలు ఇవ్వటం వరకు మాత్రమే పరిమితమవుతున్నాయని అంటున్నారు.

గాజాలో గత 24గంటల్లో 42మంది మృతి

- మొదటి దశ పోలియో డ్రైవ్ పూర్తి
- కాల్పుల విరమణపై అమెరికా నిజాయితీగా వ్యవహరించాలన్న హమాస్

గాజా : గాజాలో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడుల్లో గత 24గంటల్లో 42మంది పాలస్తీనియన్లు మరణించారు. 107మంది గాయపడ్డారు. బురెజి, మఘజి శరణార్థ శిబిరాల్లో పెద్ద ఎత్తున పేలుళ్ళు వినిపిస్తుండగానే డేర్ ఎల్ బాలాహ్ నగరంలో పాలస్తీనా చిన్నారులకు పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగింది. పోలియో వ్యాక్సిన్లు వేయాల్సి వున్నందున మానవతా దృక్పథంతో కాల్పులకు విరామం ప్రకటించాలని కోరినా ఇజ్రాయిల్ అందుకు అంగీకరించకపోవడంతో ఈ రెండు శిబిరాల్లో దాడులు కొనసాగాయి. మరోపక్క వెస్ట్ బ్యాంక్‌పై మిలటరీ సాగిస్తున్న దాడులు 8వ రోజుకు చేరుకున్నాయి. ఇప్పటివరకు ఏడుగురు చిన్నారులతో సహా 33మంది పాలస్తీనియన్లు మరణించగా, 130మంది గాయపడ్డారు. ఎక్కువ మరణాలు జెనిన్ నగరంలో చోటు చేసుకున్నాయి. నామా కాలేజీలో తల దాచుకున్న శరణార్థులపై దాడులు జరగడంతో ఆరుగురు పాలస్తీనియన్లు మరణించారు. డజన్ల సంఖ్యలో బాధితులు శిథిలాల కింద కూరుకుపోయారు. దాదాపుగా గత 11మాసాలుగా కొనసాగుతున్న దాడుల్లో 40,861మంది మరణించగా, 94,398మంది గాయపడ్డారు. వారం రోజుల పాటు సాగిన రఫా ఆపరేషన్‌లో 200మంది పాలస్తీనియన్లను హతమార్చినట్లు ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. రఫాలో తాల్ అజ్ సుల్తాన్ ఏరియాలో డజన్ల సంఖ్యలో ఆయుధాలను కనుగొన్నారు. ఇళ్ళల్లో కూడా కొన్ని ఆయుధాలను కనుగొన్నామని మిలటరీ తెలిపింది. నుస్రత్ శరణార్థ శిబిరంలో ఒక ఇంటిపై జరిగిన వైమానిక దాడిలో పలువురు మరణించారని మీడియా వార్తలు తెలిపాయి. ఈ శిబిరంపై బుధవారమే రెండు దాడులు జరిగాయి. ఇదిలావుండగా, కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి కొత్త ప్రతిపాదనలపై ఎలాంటి సమాచారం లేదని హమాస్ తెలిపింది. అమెరికా నుండి తమకు కొత్త ప్రతిపాదనపై అధికారికంగా ఎలాంటి సమాచారం ఎవరూ ఇవ్వలేదని హమాస్ ప్రతినిధి ఒసామా హమ్‌దాన్ తెలిపారు. అసలు అమెరికా నిజాయితీగానే ఈ విషయంలో వ్యవహరిస్తోందా లేదా రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని పైపైకి మాట్లాడుతోందా అని ఆయన ప్రశ్నించారు. ఇక మరిన్ని చర్చలు జరపాలని అనుకోవడం లేదని హమ్‌దాన్ అన్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం ప్రతీసారీ తమకు నమ్మక ద్రోహం చేస్తోందని అన్నారు. మేలో ప్రతిపాదించిన కాల్పుల విరమణ ప్రతిపాదననే ఆమోదించాల్సిందిగా అమెరికా నిజాయితీగా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని కోరారు. సెంట్రల్ గాజాలో మొదటి దశ పోలియో వ్యాక్సినేషన్ డ్రైవ్ పూర్తయిందని డబ్ల్యుహెచ్ఓ తెలిపింది. 1,87,000మంది చిన్నారులకు మొదటి డోసులు వేసినట్లు పేర్కొంది. ఏ ఒక్క చిన్నారిని మిస్ అవకుండా వుండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకోసం మరో మూడు రోజుల పాటు నాలుగు నిర్దిష్ట ప్రాంతాల్లో వ్యాక్సిన్లు వేయనున్నట్లు ఎక్స్ పోస్టులో పేర్కొంది. తర్వాత దక్షిణ గాజాలో ఈ డ్రైవ్ చేపట్టనున్నారు.


గాజాలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది


అడవిని పరిశీలిస్తున్న పిసిసిఎఫ్ డోప్రియాల్

మేడారం అడవుల్లో సుడిగాలి బీభత్సం

- కుప్పకూలిన 50వేలకు పైగా వృక్షాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా అడవుల్లో మంగళవారం రాత్రి సుడిగాలి బీభత్సం సృష్టించింది. ఈ ప్రభావంతో మేడారం-తాడ్వాయి ఫారెస్ట్ ఏరియాలోని భారీ వృక్షాలు నేలకూలాయి. సుమారు 15 కిలోమీటర్ల మేర విస్తీర్ణంలో పెద్ద పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. అటవీశాఖ పిసిసిఎఫ్ డోప్రియాల్ బుధవారం అధికారులతో కలిసి అడవిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడారం అడవుల్లో సుమారు 200 హెక్టార్ల మేర 50వేలకు పైగా చెట్లు నేలమట్టం అవ్వడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. అడవుల్లో పెద్ద ఎత్తున గాలి దుమారం, సుడి గాలుల బీభత్సంతో మహావృక్షాలు సైతం కుప్పకూలాయని, దీనికి సంబంధించిన వివరాలు ఇంకా పరిశోధనాత్మకంగా పరిశీలించి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఆగస్టు 31న సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య మేడారం ప్రాంతంలో భారీ వర్షంతో పాటు బలమైన ఈదురు గాలులు వీచాయని, దాంతో ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి మేడారం మీదుగా తాడ్వాయి మండలం గోనెపల్లి వరకూ భారీ నష్టం జరిగిందని తెలిపారు. తన 38 సంవత్సరాల సర్వీసులో ఇలాంటి సంఘటన దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. స్థానిక వాతావరణ పరిస్థితుల దృష్ట్యా చెట్లకు నీరు, పోషకాలు ఉపరితలం పైనే లభించడంతో వాటి వేర్లు చాలా లోతు వరకు వెళ్లలేదని, అందుకే చెట్లు పడిపోయి ఉంటాయని తెలిపారు. టోర్నడోల్లాంటి బలమైన సుడిగాలులే ఈ స్థాయిలో చెట్లను కూల్చివేస్తాయని వాతావరణ నిపుణులు తెలిపారన్నారు. జిల్లా ఫారెస్ట్ అధికారి రాహుల్ జావేద్ ఆధ్వర్యంలోని బృందం ఉపగ్రహ డేటా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)తో కలిసి పరిశీలన జరుపుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు బి ప్రభాకర్, భీమానాయక్, రాహుల్ కిషన్ జాదవ్, రమేష్, వజ్రారెడ్డి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధన జరిపించాలి : మంత్రి సీతక్క

ములుగు అడవుల్లో సుడిగాలి వల్ల చెట్లు నేలకొరగడంపై కేంద్రం పరిశోధన జరిపించి కారణాలు గుర్తించాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క తెలిపారు. బుధవారం మంత్రి సీతక్క రాష్ట్ర సచివాలయం నుంచి పీసీసీఎఫ్, డీఎఫ్ఓలతో టెలిఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. అడవిలో సుడిగాలి వచ్చింది కాబట్టి ప్రాణనష్టం జరగలేదు..అదే గ్రామాల్లో సంభవించి ఉంటే పెను విధ్వంసం జరిగేదని అన్నారు.

ఇజ్రాయిల్‌కు ఆయుధ ఎగుమతులు ఆపండి

- కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంలో పిల్

న్యూఢిల్లీ : గాజాలో దాడులు కొనసాగుతున్న సమయంలో ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, ఇతర మిలటరీ పరికరాలు ఎగుమతి చేయడానికి భారత కంపెనీలకు ఇచ్చిన లైసెన్సులు, అనుమతులు రద్దు చేయాలని, కొత్త అనుమతులు లేదా లైసెన్సుల జారీని నిలిపి వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలైంది. రిటైర్డ్ దౌత్యవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు మొత్తంగా 11మంది ప్రముఖులు బుధవారం ఈ విషయమై సుప్రీంను ఆశ్రయించారు. న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, చెరియల్ డిసౌజాలు ఈ పిటిషన్ వేశారు. అంతర్జాతీయ చట్టాల కింద భారత్‌కు గల బాధ్యతలు, విధులను ఉల్లంఘించేలా, రాజ్యాంగంలోని 51సి అధికరణ కింద జీవించే హక్కు, సమానత్వపు హక్కులను అతిక్రమించేలా ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సరఫరా జరుగుతోందని ఆ పిటిషన్ పేర్కొంది.

ఇలా అనుమతులు పొందిన కంపెనీల్లో అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్, రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ కంపెనీ, ఇంకా ఇతర ప్రైవేటు కంపెనీలు వున్నాయి. గాజాలో ఇజ్రాయిల్ పాశవికంగా దాడులు కొనసాగిస్తున్న సమయంలో కూడా ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, మందుగుండు సామాగ్రి ఎగుమతి చేయడానికి భారతదేశంలో మూడు కంపెనీలకు అనుమతులు ఇచ్చారని ఆ పిటిషన్ పేర్కొంది. ద్వంద్వ ప్రయోజనాలకు ముఖ్యంగా మిలటరీ ప్రయోజనాలకు ఉపయోగించేందుకు ఆయుధాలు ఎగుమతి చేయడానికి అధికారం వున్న డిజిఎఫ్‌టి (విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్), డిడిపి(రక్షణ ఉత్పత్తి విభాగం) ఈ రెండింటిలో ఏదో ఒక దాన్నుండి లైసెన్సులు పొందారని ఆ పిటిషన్ పేర్కొంది. ఇజ్రాయిల్‌కు ఇప్పటికే ఎగుమతి అయిన ఆయుధాలను మారణకాండకు ఉపయోగించకుండా వుండేలా, అంతర్జాతీయ మానవతా చట్టాలను అతిక్రమించకుండా వుండేలా చర్యలు తీసుకోవడానికి భారత్ తక్షణమే కృషి చేయాలని ఆ పిటిషన్ కోరింది. రాజ్యాంగ సూత్రాలు నిర్దేశిస్తున్న నేపథ్యంలో ఇజ్రాయిల్‌కు ఏ రకమైన ఆయుధాలనైనా సరఫరా చేయడమనేది నైతికంగా సమర్ధనీయం కాదని, చట్టపరంగా, రాజ్యాంగపరంగా సరైన చర్య కాదని పిల్ పేర్కొంది. ఈ పరిస్థితుల్లో ఇజ్రాయిల్‌కు తక్షణమే సాయాన్ని భారత్ నిలిపివేయాలని, ముఖ్యంగా సైనిక సాయం అస్సలు అందరాదని పేర్కొంది. ఇప్పటివరకు జరిగిన ఎగుమతులేవైనా సరే అదంతా కూడా అంతర్జాతీయ, దేశీయ చట్టాల ఉల్లంఘనే అవుతుందని, వెంటనే వాటిని ఆపాలని పిటిషన్ కోరింది.

గందేర్‌బల్ నుంచి ఒమర్ అబ్దుల్లా నామినేషన్

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గందేర్‌బల్ నియోజకవర్గం నుంచి మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ఉపాధ్యక్షులు ఒమర్ అబ్దుల్లా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఒక్కసారిగా టోపీ తీసిన ఆయన.. గందేర్‌బల్ నుంచి ఒక్కసారి గెలిపించాలని అభ్యర్థించారు. తన పరువు ఓటర్ల చేతుల్లోనే ఉందంటూ చేతులు జోడించి అభ్యర్థించడం గమనార్హం. 'ఈ రోజు ఒక్కమాట చెప్పదలచుకున్నా. నా పరువు మీ చేతుల్లోనే ఉంది. ఈ ఎన్నికల్లో గెలిపించాలని చేతులు జోడించి అడుగుతున్నా" అంటూ భావోద్వేగంతో అక్కడున్న వారిని వేడుకున్నారు.

ఒమర్ అభ్యర్థనతో అక్కడున్న పార్టీ కార్యకర్తలందరూ నినాదాలతో మద్దతు తెలిపారు. కొందరు కార్యకర్తలు ఆయన మాటలతో కంటతడి పెట్టడం కూడా కనిపించింది. జమ్ముకాశ్మీర్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో (సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1) పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

హర్యానా, కాశ్మీర్ ఎన్నికల్లో బిజెపి ఓటమికి ప్రచారం

- సంయుక్త కిసాన్ మోర్చా వెల్లడి

న్యూఢిల్లీ : మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చారిత్రక ఉద్యమాన్ని నడిపిన రైతు సంఘాల సమాఖ్య సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) వచ్చే నెల్లో జరగనున్న హర్యానా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఓటమి కోసం ప్రచారం చేయనుంది. వచ్చే ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామనిఎస్‌కెఎం నేతలు తెలిపారు. స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగా కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)ను ఇవ్వడంలో విఫలమైన బిజెపికి ఓటువేయవద్దని కోరుతూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేయనున్నట్లు ఎస్‌కెఎం నేతలు చెప్పారు.

హిస్సార్‌లో మహాపంచాయత్


హర్యానాలో ప్రచారాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 7న హిస్సార్‌లో కార్మికులు, రైతులు, ఉద్యోగులు (శాశ్వత, కాంట్రాక్ట్)తో మహా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎస్‌కెఎం హర్యానా శాఖ వెల్లడించింది. ఎస్‌కెఎం నేత ఇందర్‌జిత్ సింగ్ మాట్లాడుతూ ఈ ప్రచార నిర్ణయానికి భాగస్వామ్య పక్షాలన్నీ ఆమోద ముద్ర వేశాయని, భివానిలో ఆగస్టు 20నజరిగిన సమావేశంలో లాంఛనంగా ఆమోదం లభించిందని చెప్పారు. ప్రభుత్వ, కార్పొరేట్ వర్గాల మధ్య గల సంబంధాలను, వారి రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడతామని సింగ్ పేర్కొన్నారు.

బికెఎంఎస్ నేత సురేష్ కోఠ్ మాట్లాడుతూ, ఎంఎస్‌పి విషయంలో ప్రతీ ముఖ్యమంత్రి తమను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఉద్యమం సమయంలో పెట్టిన కేసులు వేటినీ ఇంతవరకు ఉపసంహరించుకోలేదన్నారు.

ఉక్రెయిన్‌లో క్యాబినేట్ పునర్వ్యవస్థీకరణ!

కీవ్: ఉక్రెయిన్‌లో రాజకీయంగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. క్యేబినేట్‌లోని పలువురు మంత్రులు రాజీనామాలు చేస్తున్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగానే కీలక శాఖలు నిర్వహిస్తున్న మంత్రులు రాజీనామా చేస్తున్నట్లు సమాచారం. తాజాగా విదేశాంగ శాఖ మంత్రి దిమిత్రి కులేబా రాజీనామా చేసినట్లు పార్లమెంట్ స్పీకర్ వెల్లడించారు. కులేబాతో పాటు రాజీనామాలు చేసిన వారిలో ఉక్రెయిన్ ఉప ప్రధాని ఓల్గా స్టెఫానిష్యాన్, వ్యూహాత్మక పరిశ్రమల శాఖ మంత్రి ఒలెక్సాండర్ కామిషిన్ ఉన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసేదిశగా మార్పులు జరుగుతాయని మంగళవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ అన్నారు. "రానున్నకాలం ఉక్రెయిన్‌కు అత్యంత కీలకం. ఆశించిన ఫలితాలు రావాలంటే.. కొన్ని విభాగాలను బలోపేతం చేయాల్సి ఉంటుంది" అని తెలిపారు.

మెరుగైన వేతనాలు, పని పరిస్థితుల కోసం
అమెరికాలో 10వేల మంది కార్మికుల సమ్మె



ఆందోళన చేస్తున్న కార్మికులు

వాషింగ్టన్ : మెరుగైన వేతనాలు, పని పరిస్థితులు కావాలని, మరింతమంది సిబ్బంది నియామకం జరగాలని కోరుతూ అమెరికావ్యాప్తంగా ఆదివారం ఉదయం నుండి 10వేల మందికి పైగా హోటల్ కార్మికులు సమ్మెకు దిగారు. అమెరికావ్యాప్తంగా కార్మిక లోకం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో 'ఒక ఉద్యోగం సరిపోతుంది' అనే నినాదంతో హోటల్ కార్మికులు అందరూ కలిసి ఒక తాటిపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. బోస్టన్, శాన్‌ఫ్రాన్సిస్కో, శాండియాగో, శాన్‌జోస్, సియాటిల్, గ్రీన్‌విచ్‌లతో సహా 9 నగరాల్లోని హోటళ్ళ కార్మికులందరూ సమ్మె చేస్తున్నారు. సోమవారం ఉదయం బాల్టిమోర్‌లో మరో 200మంది తమ విధులను బహిష్కరించారు. 'మా కుటుంబాలను పోషించలేని వేతనాలను మేం వ్యతిరేకిస్తున్నాం. ఇది అవమానకరం, ఇక్కడితో దీన్ని ఆపాలి' అంటూ వారు నినాదాలు చేశారు. హిల్టన్, హయత్, మారియట్‌లతో సహా ప్రముఖ హోటళ్ళ కార్మికులు కూడా సమ్మెకు దిగారు. ఇటీవలి సంవత్సరాల్లో హోటళ్ళ ఆదాయం బాగా పెరిగింది. రికార్డు స్థాయిల్లో లాభాలను ఆర్జిస్తున్నారు. కానీ కార్మికుల వెతలు మాత్రం తీరడం లేదు. పెరిగిన వ్యాపారం వల్ల కలిగే లాభాలేవీ తాము కనీసం చూడను కూడా చూడడం లేదని వారు వాపోతున్నారు. కోవిడ్ సమయంలో కోత విధించిన జీతాలే ఇప్పటికీ కొనసాగిస్తుండడం విచారకరమని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. 2019 నుండి 2022 నాటికి సిబ్బంది 13శాతం తగ్గిపోయారు. బతకాలంటే వారానికి 70 నుండి 80 గంటల పాటు పనిచేయాల్సి వస్తోందని, కనీసం పిల్లలను కూడా చూసుకోవడానికి వుండడం లేదని అల్‌ఫ్రెడో అనే కార్మికుడు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె చేస్తున్న హోటళ్ళ సర్వీసులను ఉపయోగించుకోవద్దని వర్కర్లు అతిథులను కోరుతున్నారు.



మీకోసం

వామును దోరగా వేయించి, పొడిచేసి ప్రతిరోజూ భోజనంలో వేడి అన్నంతో కలిపి మొదటి రెండు ముద్దలు తింటే కడుపుబ్బరం తగ్గుతుంది.

జీవన సౌరభం

అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఉండడం జీవిత లక్ష్యం కాదు. అవకాశాలను కల్పించుకోవడమే ఆశయం.

నేను సైతం గురువునై ...



నేను సైతం.. గురువునై
జగతి వెలుగుకు
సూర్యుడై కాంతినిస్తాను!

నేను సైతం.. గురువునై
జ్ఞాన సంపదను
పంచి పెడుతూ దారి చూపుతాను!

నేను సైతం.. గురువునై
అజ్ఞాన తిమిరం
రూపుమాపే కొవ్వొత్తినై కరిగిపోతాను!

నేను సైతం.. గురువునై
నల్లబల్లకు అక్షరాలద్ది
చిన్నారులమదిని రంజింపజేస్తాను!

నేను సైతం.. గురువునై
నాగరికత పరిభ్రమణములో
నాయకుడునై ముందడుగు వేస్తాను!

నేను సైతం.. గురువునై
ఆధునికతను మేళవించి
శాస్త్ర విజ్ఞాన పరిమళాలు వెదజల్లుతాను!

నేను సైతం.. గురువునై
నిరంతర విద్యార్థినై
శిష్యుల మనసు రంజింపజేస్తాను!

నేను సైతం.. గురువునై
గురుపరంపరలో
బోధనకు అంకితం అవుతాను!

– మొర్రి గోపి,
కవిటి,
శ్రీకాకుళం జిల్లా,
88978 82202.

నేను గీసిన బొమ్మ





ఎన్. ప్రియాంక,
9వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్,
నిజాంపేట్,
మెదక్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



అమ్మంటే అంతే..!

ఆపదలో ఉన్న బిడ్డను రక్షించేందుకు తల్లి ఎంతటి కష్టాన్నైనా లెక్కచేయదు. తన శక్తికి మించిన పనైనా ఏమాత్రం ఆలస్యం చేయదు. ఉత్తరప్రదేశ్ బహరాచి జిల్లాలో ఇప్పుడు చోటుచేసుక్ను ఓ సంఘటన సరిగ్గా ఈవిషయాన్ని రుజువుచేసింది. కొంతకాలంగా ఆ జిల్లాలో ఓ తోడేళ్ల గుంపు గ్రామాలపై పడి చిన్నబిడ్డలను ఎత్తుకుపోతోంది. పదుల సంఖ్యలో చిన్నారులు తోడేళ్ల దాడిలో చనిపోయారు. ఇంతటి విషమ పరిస్థితిలోనే హార్ది ప్రాంతంలో నివసిస్తున్న గుడియా కుమారి, తన బిడ్డను తోడేలు దాడి నుండి రక్షించింది. బిడ్డకు రక్షణకవచంలా నిలిచింది.

శనివారం రాత్రి ఐదేళ్ల పారా, తన తల్లి గుడియా పక్కన ప్రశాంతంగా నిద్రిస్తున్నాడు. బిడ్డ తన పక్కనే నిద్రిస్తున్నాడన్న ప్రశాంతతో ఆ తల్లీ ఆదమరిచి నిద్రపోయింది. తెల్లవారుజామున ఆమెకు చాలా నెమ్మదైన స్వరంతో ఏదో వింత శబ్దం రావడంతో కళ్లు తెరిచి చూసింది. 'బాగా చీకటిగా ఉంది. చుట్టూ ఏం కనిపించలేదు. అయితే నాకు కొంచెం దూరంగా రెండు కళ్లు మిలమిల మెరుస్తూ కనిపించాయి. కాస్త కళ్లు నులుపుకుని చూస్తే, అది ఒక తోడేలు. దాని నోట్లో నా గారాల బిడ్డ. వాడి మెడను చాలా ఒడుపుగా పట్టుకుని అది తీసుకుపోతోంది. ఆ క్షణం నా కళ్ల ముందు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. కానీ నా బిడ్డ ఆపదలో ఉన్నాడు. వాడ్ని ఎలాగైనా రక్షించాలనుకున్నాను. ఒక్క ఉదుటున మంచం పైనుండి కిందికి దూకాను. తోడేలు ఉన్న చోటికి ఒక్క పరుగున వెళ్లాను. దాని మెడను నా రెండు చేతుల్తో గట్టిగా పట్టుకున్నాను. అది నా బిడ్డను ఎంతలా అదిమేస్తుందో చూసి తట్టుకోలేక నేను కూడా అంతలా నొక్కి పట్టుకున్నాను. దానికి ఊపిరాడలేదు. నా పారాని విడిచిపెట్టేసింది. అప్పుడు గట్టిగా ఊపిరిపీల్చుకుని, ఇంట్లో వాళ్లకి వినపడేలా పెద్దగా కేకవేశాను. వాళ్లందరూ వచ్చేలోగా అది అక్కడి నుండి పారిపోయింది' అని ఆదివారం తెల్లవారుజామున జరిగిన సంఘటన గురించి గుడియా చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో భయం, ధైర్యం ఒకేసారి కనిపించాయి.

తోడేలు నోటి నుండి కింద పడ్డ బిడ్డను గుడియా అమాంతం హత్తుకుని ఊపిరితో ఉన్నాడో లేదోనని పరీక్షించింది. బిడ్డ నెమ్మదిగా శ్వాసిస్తున్నాడు. అయితే తన మెడచుట్టూ తోడేలు పంటిగాయాలయ్యాయి. కుటుంబసభ్యుల సాయంతో పారా ఇప్పుడు క్షేమంగా ఉన్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పారా మంచం పక్కనే తదేకంగా తననే చూస్తూ కూర్చొంది గుడియా. బిడ్డ క్షేమంగా ఉన్నాడన్న సంతోషం ఆమె కళ్లల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ రోజు జరిగిన సంఘటన గురించి ఎవరైనా అడిగితే.. 'అది మరోసారి నా బిడ్డపై దాడి చేస్తే, ఈసారి దాన్ని చంపేస్తాను' అంటూ ఎరుపెక్కిన కళ్లతో చెబుతోంది. అమ్మంటే అంతే.. కులం, మతం, జాతుల తేడా లేదు. బిడ్డల క్షేమం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టేస్తారు.

మీ ఫ్రిజ్‌ని ఎలా వాడుతున్నారు?



వరదలతో ఇంట్లో సామానంతా రోజుల తరబడి నీళ్లల్లో నానిపోతోంది. ఈ సమయంలో ఫ్రిజ్, ఏసీ వంటి ఎలక్ట్రిక్ వస్తువుల నిర్వహణ చాలా కష్టంగా ఉంటుంది. సరైన విధానంలో వాటిని బాగుచేసుకుంటేనే అవి ఎక్కువకాలం మన్నుతాయి. మరమ్మతుల పని పూర్తయ్యాక ఎప్పుడూ ఉపయోగించే రిఫ్రిజిరేటర్‌ని మునుపటిలా కాకుండా చాలా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి.

ఖాళీగా ఉంచొద్దు

చాలామంది రిఫ్రిజిరేటర్‌ను తక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు. ఎక్కువ సామాన్లు పెట్టడం వల్ల ఎలక్ట్రిసిటీ ఎక్కువ ఖర్చవుతుందని భావిస్తారు. అది కరెక్టు కాదు. ఫ్రిజ్‌కు థర్మల్ మాస్ చాలా అవసరం. థర్మల్ మాస్ సరిగ్గా ఉన్నప్పుడే కూలింగ్ సరిగ్గా ఉంటుంది. తక్కువ సామాన్లున్న ఫ్రిజ్‌ను ఓపెన్ చేసినప్పుడు బయట ఉండే వెచ్చదనం లోపలుండే ఆహార పదార్థాలను అబ్సార్బ్ చేసుకుంటుంది. దాంతో రిఫ్రిజిరేటర్ పనితీరు సరిగా ఉండదు. ఫ్రిజ్‌లో పెట్టడానికి ఎక్కువ సామాన్లు లేకపోతే ఖాళీ బాటిల్సయినా ఉంచాలి. అప్పుడు థర్మల్ మాస్ పెరిగి ఫ్రిజ్ పనితీరు బాగుంటుంది.

క్లీనింగ్

ఫ్రిజ్ నిర్వహణలో క్లీనింగ్ ప్రాసెస్ చాలా ముఖ్యం. చాలామంది ఫ్రిజ్ ఓపెన్ చేసి అంతా శుభ్రంగా ఉందని భావిస్తారు. కానీ మనకు తెలియకుండా ఎంతో దుమ్ము లోపల, బయట ఉండిపోతుంది. కాబట్టి మూడు నెలలకు ఒకసారైనా ఫ్రిజ్‌ను డీప్ క్లీన్ చేయాలి. ఫ్రీజర్‌కు పట్టిన ఐస్ మొత్తం కరిగే వరకు అలా వదిలేయాలి. చాకు, ఇతర వస్తువులతో ఐస్‌ను తొలగించే ప్రయత్నం చేయొద్దు. లోపల ఉండే డ్రాయర్స్, షెల్ఫ్‌లను శుభ్రం చేసి తిరిగి ఆర్గనైజ్ చేసుకోవాలి.

కాయిల్స్

బయట భాగంలో ఉండే కాయిల్స్ ఫ్రిజ్ లోపల ఉండే వేడిని బయటకు పంపుతాయి. ఈ కాయిల్స్ నిండా దుమ్ము చేరితే వేడి బయటకు వెళ్లదు. కాబట్టి కాయిల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

డోర్స్

ఫ్రిజ్ తలుపులు ఎప్పుడూ మూసే ఉంచాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఫ్రిజ్‌ను ఎక్కువగా తెరుస్తూ ఉంటారు. దాంతో ఫ్రిజ్ డోర్ సరిగా సీల్ అవ్వదు. ఎక్కువ డస్ట్ పట్టినప్పుడు డోర్ సీల్ కావడానికి సమయం పడుతుంది. కాబట్టి డోర్ భాగంలోని సీల్స్‌ను పూర్తిగా శుభ్రం చేసుకోవాలి. బేకింగ్ సోడాను నీటిలో కలిపి టూత్ బ్రష్‌తో శుభ్రం చేస్తే దానిపై ఉండే దుమ్ము తొలగిపోతుంది. డోర్ సులువుగా సీలవుతుంది. ఎలక్ట్రిసిటీ వృథా కాదు. ఫ్రిజ్ పనితీరు మెరుగవుతుంది.

టెంపరేచర్ చెక్

రిఫ్రిజిరేటర్ పూర్తిగా ఉష్ణోగ్రతలపై ఆధారపడి పనిచేస్తుంది. ఫ్రిజ్ టెంపరేచర్ 37–38 డిగ్రీల ఫారెన్ హీట్‌లో ఉండాలి. ఫ్రీజర్ జీరో డిగ్రీలో ఉండాలి. అప్పుడే ఫ్రిజ్ సరైన తీరులో పని చేస్తుందని అర్థం. లోపలి భాగంలో ఉష్ణోగ్రతలను చెక్ చేస్తూ ఉండడం వల్ల ఫ్రిజ్ పనితీరును తెలుసుకోవచ్చు.

వెంట్స్‌ను బ్లాక్ చేయొద్దు

రిఫ్రిజిరేటర్‌లో చల్లదనాన్ని ఇవ్వడానికి కొన్ని రకాల వెంట్స్ ఉంటాయి. చాలామంది వారికి తెలియకుండానే షీట్స్, ఇతర వస్తువులతో వెంట్స్‌ను మూసేస్తారు. అలా చేస్తే ఆహార పదార్థాలకు కూలింగ్ అందదు. ఈ మధ్యకాలంలో వస్తున్న రిఫ్రిజిరేటర్లకు ప్రతి కంపార్ట్మెంట్‌కూ వెంట్స్ ఉంటున్నాయి. వీటిని మూసేయడం వల్ల కూలింగ్ తగ్గి టెంపరేచర్ పెరుగుతుంది. పదార్థాలు పాడవుతాయి.

– కొన్ని రకాల రిఫ్రిజిరేటర్లకు మెయింటెనెన్స్ గైడ్ ఇస్తారు. వాటిని తప్పక పాటించాలి. అన్ని రిఫ్రిజిరేటర్లు ఒకే విధంగా ఉండవు. కాబట్టి రిఫ్రిజిరేటర్ పనితీరుపై పూర్తి అవగాహనతో ఉండాలి.



వరద బాధితులకు అండగా టాలీవుడ్

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులను ఆదుకునేందుకు టాలీవుడ్‌కు చెందిన సెలబ్రిటీలు మేమున్నామంటూ తోచిన సాయం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభాస్, అల్లు అర్జున్, చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ తమవంతు సాయం చేశారు. చిరంజీవి, బాలకృష్ణ, మహేష్‌బాబు తదితరులు రెండు రాష్ట్రాలకు రూ.50 లక్షలు చొప్పున విరాళాలను ప్రకటించారు. వీరితోపాటుగా సినీ హీరో రాంచరణ్ రెండు రాష్ట్రాలకు కలిపి రూ.కోటి రూపాయలు, విశ్వక్‌సేన్, సిద్ధు జొన్నలగడ్డ కూడా కొంతమొత్తంలో విరాళాలను ప్రకటించారు. హీరో ప్రభాస్ రెండు రాష్ట్రాలకు రూ.కోటి చొప్పున రూ.2 కోట్లు, అల్లు అర్జున్ రూ.50 లక్షలు చొప్పున రూ.కోటి ప్రకటించారు. కమెడియన్ అలీ దంపతులు రూ.3 లక్షలు చొప్పున రూ.6 లక్షలు ప్రకటించారు. యువ దర్శకుడు తల్లాడ సాయికృష్ణ ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు రూ.1.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. అతడి స్నేహితులకు కలిసి వరదలతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఆహారం, నిత్యావసర వస్తువులను పంపిణీచేశారు. అక్కినేని నాగార్జున కుటుంబ సభ్యులు రూ.50 లక్షలు చొప్పున రూ.కోటి విరాళంగా అందజేశారు. విశాఖపట్టణంలోని అలుఫ్లోరైడ్ లిమిటెడ్, హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని కుటుంబానికి చెందిన గ్రూప్ కంపెనీస్ ఈ సాయాన్ని అందజేశాయి.

బాధితులకు తాత్కాలిక షెల్టర్లు

తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులకు టాలీవుడ్ సెలబ్రిటీలు తమ వంతు సాయం చేస్తున్నారు. తాజాగా, బాలీవుడ్ నటుడు సోనూసూద్ వరద బాధితులకు ఆహారం, తాగు నీరు, మెడికల్ కిట్స్ అందిస్తున్నట్లు తన ఇన్‌స్టా ద్వారా తెలిపాడు. ఇల్లు కోల్పోయిన వారికి తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. 'దీనికోసం మా టీమ్ సభ్యులు విశ్రాంతి లేకుండా పని చేస్తున్నారు. సాయం కోసం ఎదురు చూస్తున్నవారు నాకు లేదా మా supportus@soodcharityfountion.org ను సంప్రదించండి అని తెలిపారు.


'పోలీస్ వారి హెచ్చరిక' సూపర్ హిట్ ఖాయం : శ్రీకాంత్



'టైటిల్ ఎంత ఆకర్షణీయంగా ఉందో.. ఫస్ట్‌లుక్ కూడా అంతే ఆకర్షణీయంగా ఉంది. ఎవరినైనా తాళ్ళతోనే, సంకెళ్ళతోనే కట్టి బంధిస్తారు. కానీ ఒక పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉంది. ఎప్పుడూ కొత్త కథలతో, కొత్త ఆలోచనలతో అడుగులేసే దర్శకుడు బాబ్జీ ఈ సినిమాతో మంచి సక్సెస్ సాధిస్తారని నాకు గట్టి నమ్మకం ఉంది' అని హీరో శ్రీకాంత్ అన్నారు. దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో తూలిక తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్థన్ నిర్మిస్తున్న 'పోలీస్‌వారి హెచ్చరిక' చిత్రం ఫస్ట్‌లుక్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు బాబ్జీ, నిర్మాత బెల్లి జనార్థన్ మాట్లాడుతూ సరికొత్త కథాంశంతో తెరకెక్కించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు. సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చేలా ఈ చిత్రాన్ని నిర్మించామన్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. తారాగణంలో సన్నీ అఖిల్, గిడ్డేష్, అజయ్‌ఘోష్, రవి కాలే, షియాజీ షిండే, శుభలేఖ సుధాకర్, కాశీ విశ్వనాథ్, జబర్దస్త్ వినోద్, జబర్దస్త్ పవన్, హిమజ, జయ వాహిని, మేఘనా ఖుషి, శంకరాభరణం తులసి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కథానాయకుడు అఖిల్, నటి జయవాహిని, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు సబలెంకా, నవారో

- టఫీ, ఫ్రిట్జ్ కూడా...
- యుఎస్ ఓపెన్ టోర్నీ





న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి 2వ సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకా, అమెరికాకు చెందిన 13వ సీడ్ ఎలేనా నవారో ప్రవేశించాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సబలెంకా 6–1, 6–2తో 7వ సీడ్, చైనా సంచలనం జంగ్‌ను ఓడించింది. మరో క్వార్టర్‌ఫైనల్లో నవారో 6–2, 7–5తో 26వ సీడ్, స్పెయిన్‌కు చెందిన బడోసాను ఓడించింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో నవారోతో సబలెంకా తొలి సెమీస్‌లో తలపడనుంది. హడ్డాడ్ మల(బ్రెజిల్) – ముచోవా(చెక్), ఇగా స్వైటెక్(పోలండ్) – పెగూలా(అమెరికా)ల మధ్య ఇతర క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఇక పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి అమెరికాకే చెందిన ఇద్దరు క్రీడాకారులు ప్రవేశించింది. బుధవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో 12వ సీడ్ ఫ్రిట్జ్ 7–6(7–2), 3–6, 6–4, 7–6(7–3)తో 4వ సీడ్ జ్వరేవ్‌ను ఓడించాడు. మరో పోటీలో 20వ సీడ్ టఫీ 6–3, 6–7(5–7), 6–3, 4–1తో ఆధిక్యతలో ఉండగా 9వ సీడ్ డెమిట్రోవ్(బల్గేరియా)పై విజయం సాధించాడు. శనివారం జరిగే రెండో సెమీస్‌లో అమెరికాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఫైనల్ బెర్త్‌కోసం తలపడనున్నారు.

ఆర్చరీలో హర్విందర్‌కు స్వర్ణం

- షాట్‌పుట్‌లో సచిన్‌కు రజతం





సచిన్ (రజతం)

పారిస్: పారా ఒలింపిక్స్‌లో ఏడోరోజు భారత్‌కు ఒక స్వర్ణ, మరో రజత పతకం దక్కాయి. పురుషుల ఆర్చరీ రికర్వ్, షాట్‌పుట్ విభాగాల్లో ఈ పతకాలు దక్కాయి. ఆర్చరీ ఫైనల్లో హరిందర్ సింగ్ 6–0 (28–24, 28–27, 29–25) పాయింట్ల తేడాతో పోలండ్‌కు చెందిన లకస్క్ క్లాజెక్‌ను చిత్తుచేశాడు. దీంతో ఈ పారా ఒలింపిక్స్‌లో ఆర్చరీ విభాగంలో మరో పతకం దక్కింది. ఇక ప్రపంచ చాంపియన్ సచిన్ సర్జేరావ్ ఖిలారి ఎఫ్46 విభాగంలో రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. గుండును 16.32మీటర్ల దూరం విసిరి సచిన్ 2వ స్థానంలో నిలిచాడు. షాట్‌పుట్‌ను 14.72, 16.32, 16.15, 16.31, 16.03 దూరంత్రో చేశాడు. ఈ విభాగంలో యాసిర్ (14.21మీ.), రోహిత్ కుమార్(14.10మీ.) 8, 9 స్థానాలకే పరిమితమయ్యారు. 30ఏళ్ల పారా ఒలింపిక్స్ చరిత్రలో షాట్‌పుట్ విభాగంలో భారత్‌కు ఓ పతకం దక్కడం ఇదే తొలిసారి. జి. స్టివర్ట్(కెనడా) 16.38మీ., స్వర్ణ పతకం చేజిక్కించుకోగా.. బాకోవిక్ (క్రొయేషియా) 16.27మీ. 3వ స్థానంలో నిలిచి కాంస్య సాధించాడు. దీంతో ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత్‌కు 11వ పతకం లభించినట్లయ్యింది. ఓవరాల్‌గా భారత్ పారా ఒలింపిక్స్‌లో 22 పతకాలతో 16వ స్థానంలో నిలిచింది.

భవీనా పటేల్‌కు నిరాశ...

టేబుల్ టెన్నిస్ మహిళల సింగిల్స్ క్లాస్–4 క్వార్టర్‌ఫైనల్లో భవీనా పటేల్ నిరాశపరిచింది. టోక్యో పారా ఒలింపిక్స్‌లో రజతం సాధించిన భవీనా పటేల్ క్వార్టర్స్‌లో 1–3 (12–14, 9–11, 11–8, 6–11)తో యింగ్ జౌ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. షూటింగ్ మిక్స్‌డ్ 50 మీటర్ల పిస్టల్ ఎస్‌హెచ్1 క్వాలిఫికేషన్‌లో నిహాల్ సింగ్ 19వ, రుద్రాంశ్ ఖండేవాల్ 22వ స్థానాలకు పరిమితమయ్యారు.

క్యూబా సంచలనం డురాండ్
400మీ. పరుగులో స్వర్ణంతో రికార్డు



పారా ఒలింపిక్స్‌లో కమ్యూనిస్టు దేశమైన క్యూబాకు మూడు స్వర్ణ పతకాలు దక్కాయి. మంగళవారం జరిగిన మహిళల 400మీ. టి–12 పరుగుల దిగ్గజం ఒమారా డురాండ్ 53.59సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానంలో నిలిచింది. దీంతో 2024 పారా ఒలింపిక్స్‌లో క్యూబాకు మూడో స్వర్ణం ఖాయం చేసింది. 2012 లండన్ ఒలింపిక్స్ నుంచి డురాంగ్ తన స్వర్ణాల పంటను పండిస్తూనే ఉంది. ఈ క్రమంలో ఆమె ఒలింపిక్స్‌లో మొత్తం 9 స్వర్ణ పతకాలను తన ఖాతాలో వేసుకున్నట్లయ్యింది. 2024 పారా ఒలింపిక్స్‌లో గులెర్మో జావెలిన్ త్రో విభాగంలో క్యూబాకు రెండో స్వర్ణ పతకాన్ని అందించాడు. బుధవారం ఒమారా, రోబియేల్, గులెర్మో త్రయం మూడో బంగారు పతకాన్ని అందించారు. ఈ ఒలింపిక్స్‌లో క్యూబా ఇప్పటివరకు 3స్వర్ణ, 1రజత పతకంతో సహా మొత్తం 4పతకాలతో 23వ స్థానంలో ఉంది.

నేటి నుంచి 'అనంత'లో దులీప్ ట్రోఫీ
టీమిండియా క్రికెటర్లు ఇండియా–సి, డి జట్ల మధ్య తొలి మ్యాచ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శ్రేయస్ అయ్యర్, రుతురాస్ గౌక్వాడ్

ప్రజాశక్తి–అనంతపురం ప్రతినిధి

అనంతపురం ఆర్‌డిటి క్రీడాగ్రామం వేదికగా గురువారం నుంచి దులీప్ క్రికెట్ ట్రోఫీ టోర్నమెంటు ప్రారంభం కానుంది. ఎ, బి, సి, డి నాలుగు టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పోటీ పడనున్నాయి. గురువారం సి, డి జట్ల మధ్య మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఎ, బి జట్ల మధ్య బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. తరువాత మ్యాచ్‌లన్నీ ఇక్కడే నిర్వహిస్తారు. ఒక్కో మ్యాచ్ నాలుగు రోజుల పాటు జరగనుంది. జాతీయ స్థాయి క్రీడాకారులందరూ ఇప్పటికే అనంతపురం విచ్చేశారు.

భావితరాలకు ప్రోత్సాహం : శ్రేయస్ అయ్యర్, రుతురాస్ గౌక్వాడ్

దులీప్ క్రికెట్ ట్రోఫీ అనంతపురం ఆర్‌డిటి స్పోర్ట్స్ విలేజ్ మైదానంలో జరగడం భావితరాలకు ప్రోత్సాహకరంగా ఉంటుందని ఇండియా ఆటగాడు టీమ్ 'సి' కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, టీమ్ 'డి' కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వెల్లడించారు. ఇక్కడి క్రికెట్ మైదానాలు, సదుపాయాలు బాగున్నాయని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న సాదియా

వరల్డ్ పవర్ లిఫ్టింగ్ విజేతలకు ఘన స్వాగతం

ప్రజాశక్తి–గన్నవరం

వరల్డ్ పవర్ లిఫ్టింగ్‌లో విజయం సాధించి బుధవారం స్వదేశానికి వచ్చిన ఇద్దరు క్రీడాకారులకు కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మాల్టాలో జరిగిన జూనియర్ పవర్ లిఫ్టింగ్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడలిస్ట్ షేక్ సాదియా అల్మస్, 6వ స్థానం సాధించిన ఎం.షానున్‌కు బంధువులు, కెఎల్ యూనివర్సిటీ విద్యార్థులు స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా షేక్ సాదియా అల్మస్ విలేకరులతో మాట్లాడుతూ మాల్టా దేశంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 8 వరకు జరుగుతున్న జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 57 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. 462.5 కేజీలు లిఫ్ట్ చేసి మెడల్ సాధించినట్లు చెప్పారు. మంత్రి నారా లోకేష్ రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందించారని, ఆయన స్పాన్సర్‌తో ఈ మెడల్ సాధించానని తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించడంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎం.షానున్ మాట్లాడుతూ.. పవర్ లిఫ్టింగ్ కోచ్, తల్లిదండ్రుల తోడ్పాటుతో తొలిసారి పవర్ లిఫ్టింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో ఆడానని, ఆరో స్థానం సాధించినందుకు ఆనందంగా ఉందన్నారు. కెఎల్ యూనివర్సిటీ కోచ్ ఘట్టమనేని సాయి రేవతికి ధన్యవాదాలు తెలిపారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68